teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 94 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 11 సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ భేటీ

98.20 ఎకరాల భూముల బదలాయింపుకు విజ్ఞప్తి



05

## రికార్డు స్థాయిలో తగ్గిన శిశు మరణాల రేటు

దేశంలో 25 పాయింట్లుగా ఉంటే తెలంగాణలో 18గా నమోదు

హరీశ్ రావు ప్రకారం చారిత్రాత్మకమైన తగ్గుదల

కేసీఆర్ హయాంలోని పథకాలే ఈ విజయానికి కారణం

మాజీ మంత్రి హరీశ్ రావు వెల్లడి





హైదరాబాద్, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో శిశు మరణాల రేటు రికార్డు స్థాయిలో తగ్గినట్లుగా తాజాగా నివేదికలు వెలువడ్డాయి. శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ నివేదిక -2023

మిగతా 2 లో

## తీరని యూరియా కష్టాలు



తెలంగాణ రాష్ట్రంలో రైతులు యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటలకు సరిపడా ఎరువులు లేక, రోజుల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన దుస్థితి నెలకొంది. ఈ సమస్యపై రైతుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, ఈ అంశం రాజకీయ దుమారానికి దారితీసింది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పరస్పర ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఓట్లను తలపిస్తున్న "యూరియా" క్యూ లైన్లు

క్యూలైన్‌లతో బారులు తీరుతున్న రైతులు

- ప్రభుత్వ హామీలకు, క్షేత్రస్థాయి వాస్తవాలకు మధ్య వ్యత్యాసం
- పొట్టకచ్చిన వరి, కాయ పువ్వు దశలో ఇతర పంటలు
- దిగుబడిపై రైతుల్లో దిగులు.. పెట్టుబడిపై రైతుల భయం
- ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు
- రాజకీయంగా యూరియా దుమారం
- యూరియాపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం

02





## సృష్టి ఫెర్టిలిటీ కేసులో సంచలనం

నమ్రతను కస్టడీకి తీసుకున్న పోలీసులు

కేసు దర్యాప్తులో కీలక వివరాలు సేకరించిన సిసిఎస్



హైదరాబాద్, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌పై కొనసాగుతున్న విచారణలో కేంద్ర క్రిమినల్ సర్వీస్ పోలీసులు కీలక వివరాలను సేకరిస్తున్నారు. ఈ క్రమంలో, ప్రధాన నిందితురాలు

మిగతా 2 లో

## గ్రూప్-1 ఫలితాల రద్దు రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు

విద్యార్థుల జీవితాలతో చెలగాటం

జీవో 29ని రద్దు చేయాలని కవిత ట్వీట్



02

## మావోయిస్టు పార్టీ వార్షికోత్సవాల వేళ కీలక ప్రకటన

ఆపరేషన్ కగార్‌ను తిప్పికొట్టాలని పిలుపు

గత ఏడాది నష్టాలు, అమరవీరులకు శ్రద్ధాంజలి

తాత్కాలిక వెనకంజను అధిగమించాలి


కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఆరోపణలు

ప్రపంచ పరిణామాలపై వ్యాఖ్యలు

మోదీ ప్రభుత్వ విధానాలపై విమర్శలు

శాంతి చర్చలకు మావోయిస్టుల షరతులు

02



## ప్రైవేటు భూముల వివాదాల జోలికి వెళ్లం

ప్రభుత్వ భూములలో ఆక్రమణలు జరిగితే ఊరుకోం

హైడ్రా మరో సారి స్పష్టం



హైదరాబాద్, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): ప్రైవేటు భూములకు సంబంధించిన వివాదాల జోలికి వెళ్లమని హైడ్రా మరో సారి స్పష్టం చేసింది. ఇదే సమయంలో చెరువులు, నాలాలు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు, ప్రభుత్వ భూములలో ఆక్రమణలు జరిగితే

మిగతా 5 లో



## బీరు, బిర్యానీలకు అలవాటు చేసిందే కేటీఆర్

కేటీఆర్ మాట్లాడుతుంటే నవ్వొస్తోంది

కేటీఆర్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం

మిగతా 2 లో

## నేపాల్ ఉద్రిక్త పరిస్థితుల వేళ రాష్ట్ర ప్రభుత్వం అలర్ట్

తెలంగాణ పౌరుల కోసం ప్రత్యేక హెల్ప్ లైన్ ఏర్పాటు



## ప్రాణాలు కాపాడే ఆవిష్కరణలకు అండగా ఉంటాం

AI ఆధారిత హెూప్ ఐను ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్

తెలంగాణను ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చిదిద్దడమే సంకల్పం



02

## జాయింట్ స్టాఫ్ కౌన్సిల్లో తొమ్మిది సంఘాలకు గుర్తింపు

కౌన్సిల్ ను అపాయింట్ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

05

# తీరని యూరియా కష్టాలు



తెలంగాణ రాష్ట్రంలో రైతులు యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో రైతులు యూరియా కోసం ఆందోళనలు, నిరసనలు చేపడుతున్నారు. మహబూబాబాద్, కామారెడ్డి, కొమరంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ వంటి జిల్లాల్లో రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. కొన్ని చోట్ల రైతులు యూరియా కోసం నిరీక్షిస్తున్న సమయంలో అస్వస్థతకు గురై సొమ్మసిల్లి పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఎరువుల కోసం ఉదయం 4 గంటల నుంచే క్యూలైన్లలో నిలబడుతున్నామని, తమ విలువైన వ్యవసాయ పనులను వదులుకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి పంటలు పొట్ట దశకు చేరుకున్న ఈ సమయంలో యూరియా వేయకపోతే దిగుబడి తగ్గిపోతుందని, తాము పెట్టిన పెట్టుబడి కూడా దక్కదని వారు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎరువుల కోసం రోజుల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ దృశ్యాలు ఎన్నికల సమయంలో ఓటు వేయడానికి క్యూలైన్లలో నిలబడిన ప్రజలను తలపిస్తున్నాయి.

**ప్రభుత్వం హామీలకు, క్షేత్రస్థాయి వాస్తవాలకు మధ్య వ్యత్యాసం**

ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగాలు రాష్ట్రంలో యూరియా కొరత లేదని, సరిపడా నిల్వలు ఉన్నాయని ప్రకటిస్తోంది. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ఎన్నో జిల్లాలో కేవలం ఒక బస్తా యూరియా కోసం రైతులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సి వస్తున్నది. అధికారులు టోకెన్ల పద్ధతి పెట్టడంతో రైతులు తమ విలువైన పనులను వదులుకొని బస్తా యూరియా కోసం మండల కేంద్రాలకు లేదా యూరియా పంపిణీ కేంద్రానికి రావలసి వస్తోంది. ఒక కుటుంబంలో అందరూ క్యూలైన్లో నిలబడితే ఒక బస్తా యూరియా వస్తుందన్న ఆశతో వచ్చి పడిగాపులు కాస్తున్నామని రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా, కొన్ని జిల్లాల్లో ఒక్కో వ్యక్తికి రెండు బస్తాలు ఇస్తుంటే, మరికొన్ని జిల్లాల్లో కేవలం ఒకే బస్తా ఇవ్వడం ప్రభుత్వ మాటలకు, చేతలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టం చేస్తోంది.

**అన్నదాతల ఆవేదన**
**పంట పెట్టుబడి కూడా రాదేమోనన్న భయం**

యూరియా కొరత వల్ల రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొనే ప్రమాదం ఉంది. వరి పంట పొట్ట దశలో.. పత్తి, మిర్చి ఇతర పంటలు కాయలు.. పూతల దశలో ఉండగా యూరియా వేయకపోతే దిగుబడి భారీగా తగ్గుతుంది. కష్టపడి అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన రైతులకు ఆ పెట్టుబడి కూడా తిరిగి రాదేమోనని భయం పట్టుకుంది. ఓటు వేయడానికి క్యూలైన్లలో బాధ్యతగా నిలబడ్డామని, కానీ ఇప్పుడు అప్పు తెచ్చిన పెట్టుబడి వస్తే చాలనే పరిస్థితిలో యూరియా కోసం క్యూలైన్లలో నిలబడాల్సి వస్తుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి, సరిపోను యూరియాను వెంటనే అందించి తమను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

**రాజకీయ పరస్పర ఆరోపణలు:**

యూరియా కొరత అంశంపై ప్రతిపక్షాలు అధికార పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నాయి. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఈ సమస్యకు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపిస్తున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ అంశంపై నిరసన ప్రదర్శనలు చేపట్టారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని ఆరోపిస్తూ ఉపరాష్ట్రపతి ఎన్నికలకు దూరంగా ఉండాలని తమ పార్టీ నిర్ణయించిందని ఆయన ఇప్పటికే ప్రకటించారు. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఆరోపణలు గుప్పిస్తోంది. కేంద్రం సరైన సమయంలో యూరియా సరఫరా చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని పేర్కొంది.

ఈ సమస్యను సత్వరమే పరిష్కరించకపోతే పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం పడి, రైతులు, సామాన్య ప్రజలు ఇద్దరూ నష్టపోతారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం, రైతులు, ప్రతిపక్షాలు సమన్వయంతో వ్యవహరించి ఈ సంక్షోభాన్ని పరిష్కరించాల్సిన అవసరం ఉందని వారు సూచిస్తున్నారు.

## బీరు, బిర్యానీలకు అలవాటు చేసిందే కేటీఆర్



మొదటి పేజీ తరువాయి

ఆయన మీడియాతో మాట్లాడుతూ హైడ్రాపై, ఇళ్ల కూల్చివేతపై కేటీఆర్ మాట్లాడుతుంటే నవ్వొస్తోందని ఎద్దేవా చేశారు. ఎన్నికలు రాగానే ప్రజలను బీరు, బిర్యానీలకు అలవాటు చేసిందే కేటీఆర్ అని మండిపడ్డారు. మాగంటి గోపీనాథ్‌పై అంత ప్రేమ ఉంటే మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఎన్నికలు వస్తేనే కేటీఆర్ వస్తారు జూబ్లీహిల్స్ ఎన్నికల్లోనూ ప్రజలు బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. అంతకుముందు సంచార జాతులకు గుడ్ న్యూస్ చెప్పారు. ఇళ్ల నిర్మాణాలు చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సంచార జాతులపై సర్వే జరుగుతుందని, సర్వే ద్వారా వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంచి తరాన్ని నిర్మించడానికి విద్యకి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సంచార జాతులు ఉద్యోగాలు పొందాలని, మన జాతి బిడ్డలకు మంచి చదువులు, నైపుణ్యాలు అందించాలన్నారు.

## సృష్టి ఫెర్టిలిటీ కేసులో సంచలనం

మొదటి పేజీ తరువాయి

డాక్టర్ నమ్రత ను ఒకరోజు కస్టడీకి తీసుకుని వివరమైన విచారణ చేపట్టారు. ఈ కేసులో ఏజెంట్ల నియామకం, శిశువుల కొనుగోలు, అక్రమ కార్యకలాపాలకు సహకరించిన అనేక డాక్టర్ల వివరాలను సీసీఎస్ అధికారులు సేకరిస్తున్నట్లు తెలిపారు. పోలీసుల దర్యాప్తు ప్రకారం, నమ్రత పదేళ్లుగా సరోగసి ముసుగులో కోట్ల రూపాయల వరకు వసూలు చేసిందని గుర్తించబడింది. సరోగసి కోసం హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ ప్రాంతాల నుండి వచ్చే దంపతుల వివరాలను ఆమె వేర్వేరు రికార్డులుగా నిర్వహించింది. అంతేకాకుం డా, నమ్రత అక్రమంగా వచ్చిన నగదు లావాదేవీల కోసం తన సిబ్బంది పేరుతో బ్యాంకు ఖాతాలను ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ లావాదేవీలు ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా నిర్వహించబడుతున్నాయి అనే అంచనాలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ తాజా వివరాల ఆధారంగా, సిసిఎస్ అధికారులు నమ్రతను మరొకసారి కస్టడీకి తీసుకుని విస్తృత విచారణ చేపట్టే అవకాశం ఉందని వెల్లడించారు. పోలీసులు ఆమె అక్రమ కార్యకలాపాలకు సంబంధించి సాక్ష్యాలను సేకరిస్తూ, మొత్తం వ్యవహారాన్ని పూర్వ వైవిధ్యంతో అన్వేషిస్తున్నారు. సృష్టి ఫెర్టిలిటీ కేసు సంచలనంగా మారడంతో, రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు ఈ వ్యవహారాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుని పూర్తి స్థాయిలో విచారణ కొనసాగిస్తున్నారు. డాక్టర్ నమ్రత, ఆమె సహకారులతో పాటు, సరోగసి, శిశు వ్యాపారం, నగదు లావాదేవీలు, అక్రమ నెట్‌వర్క్ పై కూడా దర్యాప్తు జోరుగా కొనసాగుతున్నది.




## మావోయిస్టు పార్టీ వార్షికోత్సవాల వేళ కీలక ప్రకటన



తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): సీపీఐ (మావోయిస్టు) పార్టీ స్థాపనకు 21 ఏళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా సెప్టెంబర్ 21 నుంచి 27 వరకు దేశవ్యాప్తంగా వార్షికోత్సవాలను విప్లవ స్ఫూర్తితో నిర్వహించాలని కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది. శత్రువు కొనసాగిస్తున్న ఆపరేషన్ 'కగార్'ను తిప్పికొట్టి, పార్టీ, పీ.ఎల్.జీ.ఏ (ప్రజా విముక్తి గెరిల్లా ఆర్మీ), ప్రజాసంఘాలను కాపాడుకోవాలని ఆ కమిటీ తమ సందేశంలో పేర్కొంది.

**గత ఏడాది నష్టాల జాబితా**

కేంద్ర కమిటీ వెల్లడించిన వివరాల ప్రకారం, గత ఏడాది పార్టీ ప్రధాన కార్యదర్శి బసవరాజు సహా పలువురు అగ్రనేతలు ప్రాణాలు కోల్పోయారు. 366 మంది మావోయిస్టు కార్యకర్తలు, గెరిల్లా యోధులు, ప్రజాసంఘాల సభ్యులు అమరులయ్యారని తెలిపింది. అంతర్జాతీయ విప్లవోద్యమంలో కూడా అనేక మంది నేతలు మరణించారని, వారందరికీ శ్రద్ధాంజలి ఘటిస్తున్నామని పేర్కొంది.

**వెనకంజ అధిగమించాలి**

1972లో చారూ మజుందార్ హత్య అనంతరం, ఎన్నో ఆపరేషన్లు ఎదురైనా ఉద్యమం తిరిగి బలపడిందని మావోయిస్టులు గుర్తుచేశారు. నేటి వెనకంజ పరిస్థితి తాత్కాలికమని, క్రమపద్ధతిలో గెరిల్లా యుద్ధాన్ని కొనసాగిస్తే విప్లవోద్యమం మళ్లీ పురోగమిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

**ప్రభుత్వాలపై ఆరోపణలు**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు "ఆపరేషన్ కగార్" పేరిట విస్తృత సాయుధ బలగాలను మోహరించాయని, ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తున్నాయని మావోయిస్టులు ఆరోపించారు. అయితే తమ ప్రతిఘటనలో శత్రు బలగాలకు కూడా గణనీయమైన నష్టాలు వాటిల్లుతున్నాయని పేర్కొన్నారు. చత్తీస్‌గఢ్‌లో జరిగిన కర్రెగుట్టి ఆపరేషన్, తెలంగాణలో జరిగిన ఎదురుకాల్పుల ఉదాహరణలను కూడా ప్రస్తావించారు. ప్రపంచ పరిణామాలపై వ్యాఖ్య అమెరికా, చైనా, రష్యా మధ్య ఆర్థిక–సైనిక పోటీ, ఉక్రెయిన్ యుద్ధం, గాజా సంఘటనలను ప్రస్తావిస్తూ ఇవన్నీ సామ్రాజ్యవాద దోపిడీని బయటపెడుతున్నాయని కమిటీ పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా విప్లవ పరిస్థితులు బలపడుతున్నాయని అభిప్రాయపడింది.

**మోదీ ప్రభుత్వంపై విమర్శలు**

'వికసిత భారత్' నినాదం ప్రజలను మోసం చేయడమే తప్ప, దేశాన్ని కార్పొరేట్ల ఆధిపత్యంలోకి నెట్టడానికి చేస్తున్న యత్నమని మావోయిస్టులు ఆరోపించారు. "ఆత్మనిర్భర్ భారత్", "వోకల్ ఫర్ లోకల్" వంటి నినాదాలు ప్రజల దృష్టి మళ్లించడానికి మాత్రమేనని విమర్శించారు.

**శాంతి చర్చలకు సిద్ధమే కాని**

మావోయిస్టులు శాంతి చర్చలకు వ్యతిరేకం కాదు. కానీ ముందుగా ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి, సాయుధ బలగాల మోహరింపును ఆపాలి అని కేంద్ర కమిటీ స్పష్టం చేసింది. ప్రజల ప్రయోజనాలకోసం ఎప్పుడైనా చర్చలకు సిద్ధంగా ఉంటామని చెప్పింది.

## రికార్డు స్థాయిలో తగ్గిన శిశు మరణాల రేటు



మొదటి పేజీ తరువాయి

ప్రకారం 2013లో దేశవ్యాప్తంగా 40 పాయింట్లుగా ఉన్న శిశు మరణాల రేటు 2023 నాటికి 25 పాయింట్లకు తగ్గింది. తెలంగాణలో ఈ రేటు 18గా నమోదైంది. ఇది జాతీయ సగటు కంటే మెరుగైన వృద్ధి రేటు సాధించినట్లుగా అధికారులు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో శిశు మరణాల రేటు 44 నుంచి 28కి, పట్టణ ప్రాంతాల్లో 27 నుంచి 18కి తగ్గినట్లు శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ నివేదిక–2023లో తేలింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలో భారీగా తగ్గిన శిశు మరణాల రేటుపై మాజీ మంత్రి హరీశ్ రావు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 2011–13లో తెలంగాణ శిశు మరణాల రేటు 41.2గా ఉండగా, 2021–23 నాటికి అది 18కి పడిపోయిందని తెలిపారు. ఇది చారిత్రాత్మకమైన 52 శాతం తగ్గుదలను సూచిస్తుందని అన్నారు. ఇది మాయాజాలం కాదని కేవలం కేసీఆర్ దూరదృష్టి మాత్రమేనని పేర్కొన్నారు. కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్లు, అమ్మ ఒడి వాహనాలు, తల్లి, బిడ్డ సంక్షేమ చర్యలు వేలాది ప్రాణాలను కాపాడాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఖాళీ వాగ్దానాలతో ప్రజలను మోసం చేసినప్పటికీ కేసీఆర్ దేశం గర్వించేలా ఉత్తమ ఫలితాలను అందించారని ఇదే నిజమైన తెలంగాణ మోడల్ అని హరీశ్ రావు ట్వీట్ చేశారు.

## గ్రూప్-1 ఫలితాల రద్దు

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): ఈ సంవత్సరం మొదట్లో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్–1 పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షలకు సంబంధించిన ఫలితాలతో పాటు మెరిట్ లిస్టును సైతం టీజీపీఎస్సీ విడుదల చేసింది. అయితే ఈ పరీక్షల మూల్యాంకనంలో అవకతవకలు జారిగాయని, ఒకే కేంద్రంలో పరీక్షలు రాసిన అనేక మందికి ఉద్యోగాలు వచ్చాయని ఆరోపిస్తూ కొంతమంది అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్ పై సుదీర్ఘంగా విచారించిన హైకోర్టు జనరల్ మెరిట్ లిస్టున్ రద్దు చేసింది. అలాగే 8 నెలల్లోపు రీవాల్యుయేషన్ చేయాలని, అది సాధ్యం కాకపోతే పరీక్షలను తిరిగి నిర్వహించాలని టీజీపీఎస్సీకి హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. కాగా మంగళవారం కోర్టు ఇచ్చిన తీర్పుపై జాగృతి అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్సీ కవిత స్పందిస్తూ ఎక్స్ వేదికగా ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని లోపాలతో గ్రూప్ – 1 పరీక్షలు నిర్వహించిందో హైకోర్టు తీర్పు స్పష్టం చేస్తోంది. గ్రూప్ – 1 మెయిన్స్ ఫలితాలను తెలంగాణ హైకోర్టు రద్దు చేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు. కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల జీవితాలతో ఎంతగా చెలగాటం ఆడుతుందో గ్రూప్ – 1 ఫలితాలను హైకోర్టు నిలుపుదల చేయడంతోనే రూఢీ అయ్యింది. గ్రూప్ – 1 ప్రిలిమ్స్ నుంచి మళ్లీ పరీక్షలు నిర్వహించి అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి. బడుగు బలహీన వర్గాలకు అన్యాయం చేసే జీవో 29 ని రద్దు చేయాలని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కవిత తన ట్వీట్ లో రాసుకొచ్చారు.

## ప్రాణాలు కాపాడే ఆవిష్కరణలకు అండగా ఉంటాం



హైదరాబాద్, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): సమాజంలో వేగంగా పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళన తదితర మానసిక. సమస్యలకు పరిష్కారం చూపించగల శక్తి సామర్థ్యం టెక్నాలజీకి ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం సైబర్ హోప్ హెల్ప్ ఇనిషియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన ఏఐ ఆధారిత మెంటల్ హెల్త్ సపోర్ట్ సిస్టం హోప్ ఐను మంత్రి బుధవారం రాయదుర్గం లోని టీ–హబ్‌లో లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇన్నోవేషన్ హబ్‌గా తెలంగాణ తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని అన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడే ఆవిష్కరణలకు అన్ని రకాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని వివరించారు. ఆ దిశగా దృష్టి సారించి ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను కనుక్కోవాలని యువ ఆవిష్కర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీ హబ్ సీఈవో కవికృత్, సైబర్ హోప్ హెల్ప్ ఇనిషియేటివ్ ఫౌండేషన్ చైర్మన్ ఇన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేపాల్ ఉద్రిక్త పరిస్థితుల వేళ రాష్ట్ర ప్రభుత్వం అలర్ట్

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): నేపాల్ లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల వేళ తెలంగాణ ప్రభుత్వం అలర్ట్ అయింది. అక్కడ చిక్కుకున్న తెలంగాణ పౌరుల కోసం ప్రత్యేక హెల్ప్ లైన్ ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. ఎవరైనా నేపాల్ లో చిక్కుకుపోతే ఇక్కడికి సంప్రదించడం ద్వారా సహాయం అందించనున్నారు. అయితే ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు నేపాల్‌లో తెలంగాణ పౌరులెవరికీ ఎలాంటి ఇబ్బందులు లేవని ప్రభుత్వం స్పష్టం చేసింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఖాట్మండులోని భారత రాయబార కార్యాలయంతో రాష్ట్ర ప్రభుత్వం సమన్వయం చేసుకుంటూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. నేపాల్‌లో ఎవరైనా తెలంగాణ చిక్కుకుంటే వారి కుటుంబ సభ్యులు ఢిల్లీలోని తెలంగాణ భవన్ అధికారులను ఈ కింది నంబర్ల ద్వారా సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు. వందన: రెసిడెంట్ కమిషనర్ ప్రైవేట్ సెక్రటరీ %฿% లైజన్ హెడ్ ం91 9871999044, జి.రక్షిత్ నాయక్: లైజన్ ఆఫీసర్. ం91 9643723157, సిహెచ్. చక్రవర్తి: పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ం91 9949351270 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు. తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యులు అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. తప్పుడు ప్రచారాన్ని పట్టించుకోవద్దని సూచించింది. తెలంగాణ పౌరులకు నేపాల్‌లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విధమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది.

# జేఎన్ఎస్‌లో నవంబర్ 10 నుండి ఆర్మీ ర్యాలీ

## హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



హనుమకొండ జిల్లా, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): ఆర్మీలో చేరేందుకు గత కొన్ని నెలల క్రితం ఆన్లైన్ విధానంలో పరీక్ష నిర్వహించగా అందులో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నవంబర్ 10నుండి 23వ తేదీ వరకూ ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీని ఆర్మీ అధికారులు నిర్వహిస్తారని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులకు నిర్వహించనున్న ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ గురించి ఆర్మీ అధికారులు జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో సమావేశమై ర్యాలీ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ లోని ఆర్మీ రిక్రూట్మెంట్ కల్నల్ సునీల్ యాదవ్ మాట్లాడుతూ ఆర్మీలో అగ్ని వీర్ నియామకాల కోసం గతేడాది హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీని నిర్వహించినట్లు చెప్పారు. ఈసారి హనుమకొండ లోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఆర్మీలో అగ్ని వీర్ ల నియామకాల ఇప్పటికే దరఖాస్తు ఆన్లైన్ విధానంలో నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 9వేల మంది వరకు అభ్యర్థులు పరీక్షలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులకు రన్నింగ్ టెస్ట్ తో పాటు శారీరక సామర్థ్య పరీక్షలు, మెడికల్ టెస్ట్, విద్యార్హతల ధ్రువ పత్రాలను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 10 నుండి 23వ తేదీ వరకు జరగనున్న ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ ని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం తోడ్పాటునందించాలని అన్నారు. స్టేడియంలో ట్రాక్ తో పాటు బ్యారికేడింగ్, టెంట్లు, షామియానాలు, విద్యుద్దీపాలు , సీసీ కెమెరాలు, జనరేటర్, మొబైల్ టాయిలెట్స్, తాగునీరు, తదితర సదుపాయాలు కల్పించాలన్నారు. పోలీస్ బందోబస్తు, మెడికల్ టీం, అగ్నిమాపక, 108 వాహనాలు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలను తెలియజేస్తూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్, వివిధ శాఖల జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ నవంబర్ 10 నుండి 23వ తేదీ వరకు జరగనున్న ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీకి వివిధ శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని ఆర్మీ అధికారులకు వివరించారు. రాష్ట్రంలో గతేడాది హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించగా ఈ ఏడాదిలో హనుమకొండ జిల్లాలో ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీని నిర్వహించే అవకాశం దక్కడంతో విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం తరఫున అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, ఆర్మీ మేజర్ ప్రకాష్ రాయ్, ఆర్మీ అధికారులు గురు దయాల్ సింగ్, సుభాష్, వి.వి. నాయుడు, వినోద్ కుమార్ శర్మ, మనీష్ కుమార్, ఆర్డిఓ రాథోడ్ రమేష్, డిఆర్డివో మేన శ్రీను, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, సిపిఓ సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, స్పోర్ట్స్ అధికారి అశోక్ కుమార్, హనుమకొండ ఏసిపి నరసింహారావు, మేరా యువభారత్ డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్ రావు, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ పోరాట స్ఫూర్తికి ప్రతీక వీరవనిత చాకలి ఐలమ్మ

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అమర సాహసంతో పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ మహిళా శక్తికి ప్రతీకగా నిలిచారని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. బుధవారం జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో, ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ

భూమి, భుక్తి కోసం చరిత్ర సృష్టించిన చాకలి ఐలమ్మ పోరాటపటిమ నేటికీ స్ఫూర్తిదాయకం అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన త్యాగం అమూల్యం. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆమె ఆశయాలను స్మరించుకోవాలి అని, ముఖ్యంగా యువత, మహిళలు ఆమె పోరాటస్ఫూర్తిని అనుసరించి సమాజ అభివృద్ధికి కృషి చేయాలి అని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ చూపిన దారి స్త్రీ సాధికారతకు, సామాజిక సమానత్వానికి మార్గదర్శకత్వం చేస్తుందని కలెక్టర్ తెలిపారు. ఆమె జీవితం నుంచి తీసుకునే స్ఫూర్తి నేటి తరాలకి మానవ విలువలు, సామాజిక న్యాయం, ధైర్యసాహసాల పాఠం నేర్పుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, బీసీ సంఘ నాయకులు అజిత్ కుమార్, ముదిగొండ రాంబాబు, సర్వేష్, జంగంపల్లి రాజు, దురిశెట్టి కుమార్, విజయలక్ష్మి, కొదుమూరి సత్యనారాయణ, కాపర్తి వెంకటాచారి మరియు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



భూపాలపల్లి, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పాత్ర విశేషమైనదని, ఆమె మహిళా చైతన్యం, శక్తికి ప్రతీక అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈరోజు చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల హక్కుల కోసం భూస్వాముల అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడి, బహుజన ఆత్మగౌరవానికి, మహిళా చైతన్యానికి మార్గం చూపారని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అన్నారు. ఆమె ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

# చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర



భూపాలపల్లి, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): నిజాం నవాబుకి, అయన తొత్తులైన భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో తన ఇళ్ళునే కార్యాలయంగా మార్చి భూమి కోసం, భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెలుగువను పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక మన తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా భూపాలపల్లి సుభాష్ కాలనీ లోని బస్ స్టాండ్ సెంటర్లోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళు లార్పించిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు.

# స్వాస్థ్ నారీ శ్వసక్త్ పరివార్ అభియాన్ విజయవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): మహిళల ఆరోగ్యం సక్రమంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యవంతంగా, బలంగా నిలుస్తుందనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం స్వాస్థ్ నారీ %–% శ్వశక్త్ పరివార్ అభియాన్' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది అని ఈ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోస్వాస్థ్ నారీ %–% శ్వసక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో బుధవారం ఐడిఓసి కార్యాలయం సమావేశం మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించుటకు గాను విస్తృత ఏర్పాటు చేయవలసిందిగా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మహిళల ఆరోగ్య రక్షణలో ఈ కార్యక్రమం ఒక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. జిల్లాలోని పల్లె దవాఖానాలు (ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు, బోధనాసుపత్రుల పరిధిలోని ప్రతి మహిళకు ఈ వైద్య శిబిరాల ద్వారా సమగ్ర ఆరోగ్య సేవలు అందించాలని ఆయన సూచించారు. మారిన జీవనశైలి, పర్యావరణ పరిస్థితులు కారణంగా మహిళలు అధికంగా బీపీ, షుగర్, హృద్రోగాలు, క్యాన్సర్, పిసిఒడి, రుతుక్రమణ సమస్యలు వంటి వ్యాధులకు గురవుతున్నారని, ఈ హెల్త్ క్యాంపుల ద్వారా రోగనిర్ధారణ జరిగితే వెంటనే తగిన చికిత్స, అవసరమైన మందులు అందించబడతాయని తెలిపారు. అదేవిధంగా ఆరోగ్య మహిళ, ఎన్‌సీడీ సెంటర్లు, క్యాన్సర్ డే కేర్ సెంటర్లు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతున్నాయని వివరించారు. ప్రతి ఆయుష్ ఆరోగ్య మందిరంలో ఔషధ మొక్కలను వాటి పేర్లతో ప్రదర్శించి, మహిళలకు ఔషధ మొక్కలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. యుక్త వయసు గల మహిళలకు అవగాహన కార్యక్రమాల లో భాగంగా, పిసిఒడి, నెలసరి సమస్యలు మరియు మహిళా ఆరోగ్యంపై చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే, అక్టోబర్ 1న జిల్లా వ్యాప్తంగా మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయాలని ఆయన ప్రత్యేకంగా సూచించారు. ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్సకు ఇబ్బందులు ఎదుర్కొనే పేద మహిళలు ఈ శిబిరాలను వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఈ ప్రత్యేక హెల్త్ క్యాంపులు సమన్వయంతో నిర్వహించబడాలని ఆయన వైద్యాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో వైద్య సిబ్బంది, మహిళా సంఘాలు, అంగన్వాడీ టీచర్లు, కార్యకర్తలు, ఏఎన్ఎంలు, చురుకుగా భాగస్వాములు కావాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి మహిళకు ఈ ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా సమగ్ర ఆరోగ్య సేవలు అందించడమే కాకుండా, పోషకాహార ప్రాధాన్యం, జీవనశైలి సంబంధిత వ్యాధుల నివారణ, ఆరోగ్యకరమైన జీవన విధానంపై చైతన్యం కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. మహిళల ఆరోగ్య పరిరక్షణ, శక్తివంతమైన కుటుంబ నిర్మాణం, సమాజ అభివృద్ధి లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రతి స్థాయిలో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆకాంక్షించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్య చందన, జిల్లా వైద్యశాఖ అధికారి జయలక్ష్మి, డిసిహెచ్ఓ రవిబాబు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని స్వర్ణలత లెనినా, మున్సిపల్ కమిషనర్లు సుజాత, శ్రీకాంత్, వైద్యులు మరియు వైద్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి కార్యక్రమం



ములుగు జిల్లా, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): వీరనారి చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి %–% బీసీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ ములుగు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బీసీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి హాజరైన అధికారులు, సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆమె వీరోచిత గాథను స్మరించుకున్నారు. బీసీ వెల్ఫేర్ అధికారి తుల రవి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణ చరిత్రలో మహిళా శక్తి ప్రతీకగా నిలిచారు. భూస్వాముల దౌర్జన్యాలకు తలొగ్గకుండా రైతుల పక్షాన నిలబడి పోరాడారు. ఆమె త్యాగస్ఫూర్తి, ధైర్యసాహసాలు ఇవాళ్టి తరానికి గొప్ప స్ఫూర్తి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించడం మాకు గర్వకారణం అని తెలిపారు. అలాగే ఆయన ఐలమ్మ చరిత్రను విద్యార్థులకు పరిచయం చేయాలని, పాఠశాలల్లో ఆమె వీరోచిత పోరాటాలను ప్రత్యేక వ్యాసాల రూపంలో బోధించాలని సూచించారు. రజక సంఘం నాయకులు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా, తెలంగాణ రైతాంగ పోరాటానికి చిహ్నంగా నిలిచారు. అణగారిన వర్గాల హక్కుల కోసం, సమానత్వం కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది అని అన్నారు. కార్యక్రమములో మణికంట రజక సంఘం అధ్యక్షుడు మరియు చాకలి ఐలమ్మ వర్ధంతి జయంతి కమిటీ అధ్యక్షుడు నగరపు రమేష్, మణికంట రజక సంఘం ప్రధాన కార్యదర్శి చాపర్తి రాజు, మణికంట రజక సంఘం కోశాధికారి ఎన్నిండ్ల మహేందర్, ఉపాధ్యక్షుడు పరికిరాల రవి, సహాయ కార్యదర్శి గూడెల్లి ఓదెలు, సలహాదారులు నేరెళ్ళ శంకర్, మరియు జాలిగం శ్రీనివాస్, %చీఎ=జ% అధ్యక్షుడు మోగుళ్ళ భద్రయ్య, రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు సారంగపాణి బీసీ వెల్ఫేర్ శాఖా ఉద్యోగులు సరిత, మానస, సాదలు, కుమారస్వామి, ప్రతాప్, మరియు నాల్గోవ తరగతుల ఉద్యోగులు పాల్గొన్నారు.

# రోడ్ల అభివృద్ధి చేసేందుకు ప్రజా ప్రభుత్వం కృషి

## భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ



కొత్తపల్లిగోరి, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లి నియోజకవర్గంలోని అంతర్గత రోడ్లు, గ్రామీణ ప్రాంత రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని, నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈరోజు బుధవారం భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మరియు కొత్తపల్లిగోరి మండలాల్లోని వివిధ గ్రామాలల్లో ఎమ్మెల్యే పర్యటించారు. మొత్తం రూ.14 కోట్ల 75 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు మరియు ప్రారంభోత్సవాలు చేశారు. కొత్తపల్లిగోరి మండలం సుల్తాన్ పూర్ లో సుల్తాన్ పూర్ గ్రామం నుండి కొత్తపల్లి (వయా వెంకటేశ్వర్లపల్లి, కోనరావుపేట) గ్రామం వరకు సీఆర్ఆర్ నిధులు రూ.450 లక్షలు ఐటీడీఏ నిధులు రూ.275 లక్షలతో నిర్మించనున్న నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శంకుస్థాపన చేశారు. రేగొండ మండలం భాగిర్దిపేట గ్రామంలో ఊరకుంట మత్తడి నుండి వ్యవసాయ పొలాల వరకు రోడ్డు రూ.30 లక్షలు, గూడెపల్లి గ్రామంలో గూడెపల్లి నుండి పొనగండ్ల వరకు రోడ్డు నిర్మాణ పనులు రూ.160 లక్షలు, కొడవటంచ గ్రామంలో రూ.29 లక్షలతో కొత్తగా నిర్మించిన హెల్త్ సబ్ సెంటర్ ను ప్రారంభించారు. దమ్మన్నపేట గ్రామంలో పోచమ్మ ఆలయ నిర్మాణ పనులకు రూ.4.95 లక్షలతో శంకుస్థాపన చేశారు. కొత్తపల్లిగోరి మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో మైదాకులపల్లి నుండి బుగులోనిజాతర వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు రూ.150 లక్షలు, సూరవాడ నుండి ఎరుకలివారికుంట వరకు వయా శ్మశానవాటిక రోడ్డు నిర్మాణ పనులు రూ.30 లక్షలు, సుల్తాన్ పూర్ తాటివనం నుండి వ్యవసాయ పొలాల వరకు రోడ్డు నిర్మాణ పనులు రూ.50 లక్షలు, కొత్తపల్లిగోరి లో కొమ్మాల చెరువు నుండి వాగు వరకు రోడ్డు నిర్మాణ పనులు రూ.20 లక్షలు, పప్పుల రవి పొలం నుండి రావుల బాపురావు పొలం వరకు రోడ్డు నిర్మాణ పనులు రూ.40 లక్షలు, నిజాంపల్లి గ్రామంలో గూడ పైడి ఇంటి నుంచి ఓదెల అశోక్ పొలం వరకు రోడ్డు నిర్మాణ పనులు రూ.40 లక్షలు, చిన్నకోడెపాక లో బండి మల్లయ్య ఇంటి నుంచి మాటు వరకు రోడ్డు నిర్మాణ పనులు రూ.20 లక్షలతో అభివృద్ధి పనులకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నేతలతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీలకతీతంగా అన్ని గ్రామాలను అభివృద్ధి పరచనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజాప్రతినిధుల సమన్వయంతో, ప్రజల భాగస్వామ్యంతో సీఎం నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అభివృద్ధి చేయడానికి దోహదపడుతుందని తెలిపారు. ఈరోజు నాణ్యతతో పాటు సకాలంలో పూర్తయ్యేలా కాంట్రాక్టర్లు, గుత్తేదారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేస్తూ, ప్రతి గ్రామంలో సమగ్రాభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే చెప్పారు. వెంకటేశ్వర్లపల్లిలో గ్రామ గ్రామైఖ్య భవనం మంజూరు చేయాలి

వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో గ్రామ గ్రామైఖ్య భవనం మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు శివమణి గ్రామైఖ్య మహిళలు తమ వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో మొత్తం 25 సంఘాలు 320 మంది సభ్యులు ఉన్నారని, ప్రతి నెల సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి గది లేకపోవడం ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యేకు సభ్యులు తెలిపారు. కాగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. త్వరలోనే భవనం మంజూరు ఇచ్చి శంకుస్థాపనకు మళ్ళీ వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి వస్తానని ఎమ్మెల్యే చెప్పారు.

# కామారెడ్డి విజయోత్సవ సభని ముదిరాజ్ లు అడ్డుకోవాలి

### ఈనెల 15న చలో కామారెడ్డి

### ముదిరాజులకు బీసీ "ఏ" వచ్చుడా..

### రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోవుడా

### జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్



భూంపల్లి, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముదిరాలకు ఇచ్చిన హామీ బీసీ"ఏ"లోకి మార్చే అంశాన్ని మరిచిపోయి ముదిరాజులను మోసం చేస్తున్నారని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. రాష్ట్ర యువత అధ్యక్షులు పడిగె ప్రశాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేడికల వెంకటేశంలతో కలిసి మాట్లాడుతూ తరాలు మారుతున్న గాని ముదిరాజుల బతుకులు మారడం లేదని ముదిరాజులను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకొని గద్దెనెక్కి ముదిరాజుల అంశాన్ని తుంగలో తొక్కుతున్నారని అందులో భాగమే రేవంత్ రెడ్డి పన్నాగమని ఎన్నికల సమయంలో ముదిరాజుల డిమాండ్ బీసీ డీ నుండి బిసి ఏలోకి మార్చడానికి జీవో 15/2019 అమలు ప్రస్తానన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయి 20 నెలలు గడుస్తున్నా ముదిరాజ్ అంశాన్ని పక్కన పెట్టి ముదిరాజుల వాటా తేల్చకుండా బీసీ గళంతో మరోమారు మోసం చేయాలని చూస్తున్నాడని స్థానిక సంస్థలు దగ్గర పడుతుండడంతో బీసీ విజయోత్సవ సభ కామారెడ్డిలో ఏర్పాటు చేసుకొని ఓట్లు దండుకోవాలని చూస్తున్నాడని కానీ ఈ లోపు ముదిరాజుల వాటా కోటా తేల్చకుంటే కామారెడ్డిలో ఏర్పాటుచేసిన రేవంత్ రెడ్డి విజయోత్సవ సభను అడ్డుకుంటామని వారు అన్నారు రాష్ట్రంలోని ముదిరాజులు కూడా ఆలోచన చేయాలని ఈ సమయం దాటితే మనకు హక్కులు సాధ్యపడవని ఈ సభను అడ్డుకుంటే మన హక్కులు సాధించుకోవచ్చు అని తెలంగాణ రాష్ట్రంలోని నలుమూలల నుండి ఈ నెల 15 తారీకు నాడు ముదిరాజులు భారీగా తరలివచ్చి విజయోత్సవని రేవంత్ రెడ్డిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు ముదిరాజ్ అంశం తక్షణమే రేవంత్ రెడ్డి తీర్చాలని లేకుంటే ఎట్టి పరిస్థితులలో కామారెడ్డి సభను అడ్డుకుంటామని వారు హెచ్చరించారు కామారెడ్డి జిల్లా ముదిరాజులు కూడా సభను అడ్డుకోవడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దామాషా ప్రాతిపదికన ముదిరాజుల కోట వాటా ఉండాలని లేకుంటే రేవంత్ రెడ్డిని అతని సభని అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల సుధాకర్ ముదిరాజ్, సుతారి రాజు ముదిరాజ్ మరియు నియోజకవర్గం ముదిరాజ్ హక్కుల సాధన సమితి నాయకులు తుమ్మల బాల్ రాజ్, భైరయ్య, రమేష్ భూపతి, రమేష, భూంపల్లి మాజీ ఎంపీటీసీ ఉల్లెంగల నరేష్, మరియు కూడవెల్లి ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఐలమ్మ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి జి. ప్రభాకర్ రెడ్డి




హనుమకొండ, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండ సిపిఎం జిల్లా కార్యాలయంలో చిట్యాల ఐలమ్మ 40 వ,వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి సిపిఎం నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. శ్రమ మాది, చేను మాది, పంట మాది, మా బతుకులపై మీ పెత్తనం ఏంది? అని దోపిడి దొరలకు ఎదురు తిరిగి వీరవనితగా నిలిచిన ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడింది. విసునూరు దేశ్ముఖ్, రజాకారుల అరాచకాలపై ఎర్రజెండా పట్టి ఎదురు తిరిగింది. చుట్టుపక్కల ప్రజలను చైతన్య పరిచి నైజాం అరాచకాలను తిప్పి కొట్టడానికి ధైర్యంతో ముందుకెళ్లిన వీరనారి చిట్యాల ఐలమ్మ స్ఫూర్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకం అన్నారు. ఐలమ్మ స్ఫూర్తితో ప్రజలను ఏకం చేసి పోరాటం చేయడమే వీరనారి ఐలమ్మకు ఘన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.వీరన్న,డి. తిరుపతి,డి భాను నాయక్, ఎల్.దీప, నాయకులు కంచర్ల కుమారస్వామి,ఎన్.కిషోర్, రమాదేవి, సుదర్శన్, బాబు పాల్గొన్నారు.

# వివిధ కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర



భూపాలపల్లి, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): ఇటీవల భూపాలపల్లి నియోజకవర్గ పరిదిలో మరణించిన వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి,తన ప్రగాఢ సానుభూతి తెలియచేసిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి.

పరామర్శించిన వారి వివరాలు:- భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జంగేడు గ్రామ వాస్తవ్యులు గూడెపు మల్లయ్య కుమార్తె కీ.శే గూడెపు సాన్విశ్రీ పాము కరిచి మరణించగా వారి కటుంబ సభ్యులను, కుందూరుపల్లి వాస్తవ్యులు కీ.శే శెట్టి మధు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మరణించగా వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భూపాలపల్లి మండలం కొంపెల్లి గ్రామ వాస్తవ్యులు మల్కాపురం యాదగిరి, వంగ లక్ష్మీ, బొల్లెబోయిన ఓదెలు మరణించగా వారి కుటుంబ సభ్యులను. గణపురం మండలం గొల్లపల్లి గ్రామ వాస్తవ్యులు కీ.శే గుండ బుచ్చిరాములు గారు మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విదంగా భూపాలపల్లి పట్టణ బిఆర్ఎస్ పార్టీ 23 వార్డు అధ్యక్షుడు గమల ప్రేమ్ అనారోగ్యంతో చికిత్స అనంతరం ఇంటివద్ద కోలుకుంటున్న వారిని మరియు భూపాలపల్లి మండలం, కొంపల్లి గ్రామ వాస్తవ్యులు పాతూరి రాజిరెడ్డి, పాతూరి బాపు రెడ్డి మరియు సలేందర్ రెడ్డి లు అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. వారి వెంట పట్టణ మరియు ఆయా మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భవనాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): జిల్లాలో అంగన్‌వాడి కేంద్రాలు, గ్రామ పంచాయతి భవనాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ,

పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, మహిళా సంక్షేమ, డిపిఓ, డిఆర్డీఓ, టీడబ్ల్యూ ఐడిసిలతో అంగన్ వాడి, గ్రామ పంచాయతి భవనాల నిర్మాణ ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భవనాల నిర్మాణం లోపాలు లేకుండా నాణ్యతతోపాటు వేగం కూడా పెంచాలని సూచించారు. పనుల పురోగతి వివరాలను సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో వేగం పెంచాలని, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. భవన నిర్మాణ పనులు పూర్తయ్యేలా కృషి చేయాలని స్పష్టంచేశారు. పంబాపూర్ ప్రాథమిక మపాఠశాల అవరణలో అంగన్ వాడి భవన నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మరుగుదొడ్ల నిర్మాణంలో జాప్యం జరగడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్ వాడి, వైద్య, పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టేందుకు ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిఆర్డీఓ బాల కృష్ణ, పీఆర్ ఈ ఈ వెంకటేశ్వర్లు, మహిళా సంక్షేమ అధికారి మల్లీశ్వరి, డివిజనల్ పంచాయతి అధికారి వీరభద్రయ్య, టిజి డబ్ల్యూఐడిసి డిఈ జీవన్ తదితరులు పాల్గొన్నారు.


# జీపీఓ లకు క్లస్టర్ల వారీగా బాధ్యతల కేటాయింపు

### ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రకటించిన అదనపు కలెక్టర్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): జిల్లా వ్యాప్తంగా ఎంపికైన గ్రామ పాలన అధికారులకు క్లస్టర్ల వారీగా బాధ్యతలు కేటాయిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో గ్రామ పాలన అధికారులకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు క్లస్టర్ల వారీగా బాధ్యతలు కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పాలన అధికారులు పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రజల సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించి, గ్రామీణాభివృద్ధి దిశగా కృషి చేయాలని ఆయన సూచించారు. జిల్లా వ్యాప్తంగా 107 మంది జిపి ఓలు ఎంపిక కాగా 100 మంది కౌన్సిలింగ్ కు హాజరయ్యారని 12 మండలాల పరిధిలో క్లస్టర్ల వారిగా అభ్యర్థులు ఇచ్చిన ఐచ్చిక మేరకు ఓపెన్ కౌన్సిలింగ్ నిర్వహించి క్లస్టర్ కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏ.ఓ మురలీధర్ రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఉప రాష్ట్రపతికి జస్టిస్ సుదర్శన్ రెడ్డి శుభాకాంక్షలు




న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): భారత ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌కు ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి శుభాకాంక్షలు చెప్పారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో రాధాకృష్ణన్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. సమీప ప్రత్యర్థి, విపక్ష ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై 152 ఓట్ల మెజార్టీతో విజయాన్ని సొంతం చేసుకున్నారు. మంగళవారం పార్లమెంటు సముదాయంలో ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం రాధాకృష్ణన్ విజయం సాధించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.సి.మోడీ ప్రకటించారు. పోలింగ్ ముగిసేటప్పటికి 767 మంది ఎంపీలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన 67 ఏళ్ల రాధాకృష్ణన్‌ను ప్రధాని మోడీ సహా పలువురు అభినందించారు. తనకు అభినందనలు తెలిపిన రాష్ట్రపతి, ప్రధాని తదితరులకు రాధాకృష్ణన్ కృతజ్ఞతలు తెలిపారు.

# జేబీఎస్ బస్‌స్టాండ్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం

**పేదలకు ఇస్తాం : ఈటల రాజేందర్**



సికింద్రాబాద్, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): సికింద్రాబాద్ జేబీఎస్ బస్టాండ్ వద్ద కూల్చివేసిన షాపుల స్థానంలో ఒక షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి పేదలకు ఇస్తామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తాను కంటోన్మెంట్ అధికారులతో మాట్లాడానని కేంద్రం ఎవరి ఉపాధిని దూరం చేయదన్నారు. కంటోన్మెంట్ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని జేబీఎస్ బంస్టాండ్, ఎరుకల బస్తీలో కంటోన్మెంట్ బోర్డు అధికారులు బుధవారం తెల్లవారుజాము నుంచి భారీ బందోబస్తు నడుమ కూల్చివేతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో జేబీఎస్ వద్ద కూల్చివేతలను పరిశీలించిన ఈటల రాజేందర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ భూమి కంటోన్మెంట్ కు చెందిందన్నారు. ఇక్కడ 35 కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయని అందువల్ల ఇక్కడ షాప్ లు కోల్పోయిన వారికి తిరిగి ఇక్కడే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఉపాధి మార్గం చూపిస్తామన్నారు ప్రజలు ప్రభుత్వానికి సహకరిస్తున్నారన్నారు.

# ప్రైవేటు భూముల వివాదాల జోలికి వెళ్ళం

మొదటి పేజీ తరువాయి



ఊరుకోదని తేల్చి చెప్పింది. తుక్కుగూడ మున్సిపాలిటీలోని వర్టెక్స్ రియల్ ఎస్టేట్ సంస్థకు – చైతన్య రెడ్డి అనే మహిళకి మధ్య ఉన్న వివాదం పూర్తిగా ప్రైవేటు వ్యవహారమని పేర్కొంది. దీని సంబంధించి అందిన ఫిర్యాదు నేపథ్యంలో ఇరుపక్షాలను ఎదురెదురుగా పెట్టి ఎంతో పారదర్శకంగా హైడ్రా విచారించింది. ఇద్దరి మధ్య ఉన్న భూ తగాదాలో హైడ్రా తల దూర్చదని హైడ్రా స్పష్టం చేసింది. సూరం చెరువులో వర్టెక్స్ సంస్థ అక్రమ నిర్మాణాలు చేపడితే వాటిని హైడ్రా కూల్చి వేసింది. కొత్తకుంట చెరువులో వర్టెక్స్ సంస్థ మట్టి పోయడాన్ని హైడ్రా సీరియస్‌గా పరిగణించింది. ఈమేరకు వర్టెక్స్‌పై రెండు కేసులు కూడా నమోదు చేసింది. వాస్తవాలు ఇలా ఉంటే హైకోర్టు బార్ కౌన్సిల్ నుంచి తొలగించబడి సాంకేతిక కారణాలతో స్టే తెచ్చుకున్న సుంకరి నరేష్ లేనిపోని ఆరోపణలు చేస్తూ ఆ విషయాలన్నీ హైడ్రాకు ఆపాదించడాన్ని హైడ్రా ఖండించింది. చైతన్యరెడ్డి పేర్కొన్న విధంగా ఆమెకు చెందిన భూమిలోంచి వర్టెక్స్ సంస్థ రహదారి వేసిన వివాదంలో ఆ ఇరువురే తేల్చుకోవాలి. ఈ విషయమై చైతన్య రెడ్డి ఇదివరకే పోలీసు స్టేషన్‌లో వర్టెక్స్‌పై కేసు కూడా పెట్టారు. న్యాయం కోసం కోర్టును కూడా ఆశ్రయించవచ్చు. తన నుంచి రూ. 50 లక్షలు తీసుకున్నారంటూ సుకంకరి నరేష్‌తో పాటు దళారీలుగా వ్యవహరించిన వారిపై చైతన్య రెడ్డి హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చైతన్యరెడ్డితో పాటు దళారీగా ఆమె పేర్కొన్న వ్యక్తిని కూడా ఎదురెదురుగా పెట్టి విచారించింది. ఈ విషయమై మరింత లోతుగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని పహాడీషరీఫ్ పోలీసు స్టేషన్లో హైడ్రా కేసు పెట్టింది. కోర్టు బార్ కౌన్సిల్ తొలగించిన తర్వాత స్టే తెచ్చుకున్న వ్యక్తికి న్యాయవాదిగా ఫీజు చెల్లించిందని సుంకరి నరేష్ పేర్కొనడం కూడా గమనార్హం. వర్టెక్స్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని హైడ్రాపై గతంలో బురద చల్లేందుకు ప్రయత్నించిన సుంకరి నరేష్ మంగళవారం మరో సారి లేని పోని ఆరోపణలు చేయడాన్ని హైడ్రా ఖండించింది. ఈ దళారీ వ్యవహారంపై పోలీసులు లోతుగా విచారించి నిజాలు నిగ్గు తేల్చుతారని హైడ్రా ఆశిస్తోంది. జరుగుతున్న పరిణామాలన్నీ ప్రజలు గమనించాలని దళారీల మాయ మాటలు నమ్మవద్దని వారి చేతిలో మోసపోవద్దని విజ్ఞప్తి చేసింది.

# ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ డబ్బులు పంచి గెలవాలని చూస్తోంది

## మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపణ



హైదరాబాద్, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ డబ్బులు పంచి గెలవాలని చూస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. బుధవారం నగరంలోని తెలంగాణ భవన్‌లో జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో ఆయన నియోజకవర్గ వర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో వ్యవహరించాల్సిన తీరుపై పార్టీ శ్రేణుకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతల జీవితాలు ఎంత దారుణంగా ఉంటాయో మాగంటి గోపీనాథ్ ఉదాహరణ అని అన్నారు. ఆయన అకాల మరణంతో కుటుంబ సభ్యులు ఇంకా సెటిల్ కాలేదని తెలిపారు. మనం మళ్లీ అండగా ఉంటే గోపీనాథ్ కుటుంబ తిరిగి నిలబడుతుందని కామెంట్ చేశారు.

**తిరుపతి రెడ్డి ఇంటి మీదికి పోదు హైడ్రా**

హైడ్రా పేరు మీద హైదరాబాద్ నగరంలో ప్రభుత్వం విధ్వంసానికి తెగబడుతోందని అన్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని నిరుపేదలు కట్టుకున్న ఇళ్లను నిర్ధాక్షిణ్యంగా కూల్చేస్తోందని మండిపడ్డారు. ఒకవేళ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కర్మకాలి కాంగ్రెస్‌కు ఓటేస్తే ప్రజలకు తమ ఇళ్లను తామే కూల్చుకున్న వారు అవుతారని కామెంట్ చేశారు. దుర్గం చెరువులో ఇళ్లు కట్టిన సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి ఇంటి మీదకి హైడ్రా పోదని వాళ్ల టార్గెట్ రహమత్ నగర్, బోరంబండ, యూసఫ్ గూడ, షేక్‌పేట్, ఎర్రగడ్డ ప్రాంతాల్లో పేదోళ్ల ఇళ్లేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఒక్క పథకం కూడా సరిగ్గా అమలు చేయలేదు కానీ జూబ్లీహిల్స్ బైపోల్‌లో డబ్బులు పంచి గెలవాలని చూస్తోందని ఆరోపించారు. రెండు సార్లు రైతు బంధు ఎగ్గొట్టి ఒక్కసారి వేశారని, ఇందిరమ్మ ఇళ్లు రాలేదు కానీ హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చుతున్నారని ధ్వజమెత్తారు. మాగంటి గోపీనాథ్ ఉండ ఉంటే పేదలకు అండగా ఉండేవారని, కాంగ్రెస్ ఆటలు సాగేవి కావని కేటీఆర్ అన్నారు.

# జాయింట్ స్టాఫ్ కౌన్సిల్లో తొమ్మిది సంఘాలకు గుర్తింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ ఉద్యోగుల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ను రాష్ట్ర ప్రభుత్వం అపాయింట్ చేసింది. ఈ మేరకు తొమ్మిది ఉద్యోగ సంఘాలకు గుర్తింపు లభించింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటి సారి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ నియామకం చేపట్టింది. అందులో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ తో పాటు మరికొన్ని ఉద్యోగ సంఘాలు ఉన్నాయి. మరో ఆరు సంఘాలకు రొటేషన్ పద్ధతిలో ఆహ్వానించనుంది.

1. తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ సెంట్రల్ యూనియన్).
2. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (సెంట్రల్ అసోసియేషన్)
3. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్ (టిజిఎస్ఎ)
4. ప్రగతిశీల గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘం
5. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం, తెలంగాణ రాష్ట్రం
6. తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్
7. తెలంగాణ క్లాస్ IV ఎంప్లాయీస్ సెంట్రల్ అసోసియేషన్
8. తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్
9. తెలంగాణ రాష్ట్ర సమాఖ్య

ఆరు సంఘాలకు రొటేషన్ పద్ధతిలో ఆహ్వానించనుంది

1. తెలంగాణ సెక్రటేరియట్ ఆఫీసర్స్ అసోసియేషన్
2. డిప్యూటీ కలెక్టర్ల సంఘం, తెలంగాణ
3. తెలంగాణ తహశీల్దార్ల సంఘం
4. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం
5. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్
6. ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం

# రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ భేటీ

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 10 (తీన్మార్ న్యూస్): హస్తిన పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఉదయం 10 గంటలకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. ఆయన వెంట ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, కడియం కావ్య ఈ సమావేశంలో ప్రధానంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోతోన్న గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు 98.20 ఎకరాల రక్షణ శాఖ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని సీఎం కోరారు. మూసీ, ఈసీ నదుల సంగమం సమీపంలో గాంధీ సర్కిల్ ఆఫ్ యూనిటీ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు ఆయన రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించారు. జాతీయ సమైక్యత, గాంధేయ విలువలకు సంకేతంగా గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ నిలుస్తుందని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.



# బీజేపీని నాశనం చేసే కుట్రలు

- రాష్ట్ర కార్యవర్గంలో కిషన్ రెడ్డి అనుచరులు
- పార్టీ పెద్దల ఆశీర్వాదం తనకే
- ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేది లేదన్న రాజాసింగ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 10:** బీజేపీని సర్వనాశనం చేయడానికి కుట్రలు జరుగుతున్నాయని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపించారు. అసలైన కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి అన్యాయం జరుగుతోందన్నారు. పార్టీలో నా మనిషి, నీ మనిషి అనే రాజకీయం నడుస్తోందని వ్యాఖ్యానించారు. కొత్త కమిటీలో 12 మంది ఒకే పార్లమెంటు సెగ్మెంట్ వాళ్లు ఉన్నారని చెప్పారు రాజాసింగ్. రాష్ట్ర కమిటీని కిషన్ రెడ్డి వేశారా? లేక రామచందర్ రావు వేశారా అని ప్రశ్నించారు. రామచందర్ రావు మంచి వ్యక్తే కానీ..రబ్బర్ స్టాంప్ అని అన్నారు. ఈ ప్లానింగ్ అంతా కిషన్ రెడ్డిదేనని విమర్శించారు. కిషన్ రెడ్డి రాజీనామా చేస్తే తాను కూడా చేస్తానని అన్నారు. కిషన్ రెడ్డి ఇండిపెండెంట్ గా పోటీ చేయాలి. నేనూ చేస్తా..ఎవరు గెలుస్తారో చూసుకుందాం అని సవాల్ విసిరారు. రాజాసింగ్ ఎప్పుడైనా ఏక్ నిరంజన్ అని..తన వెనుక ఎవరూ లేరన్నారు .రాజీనామా చేయనని ఏం చేసుకుంటారో చేసుకోండని వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చే పార్టీని పండబెట్టారని వ్యాఖ్యానించారు. ఇపుడు ఏ కార్యకర్త పనిచేయడానికి ఇష్టపడటం లేదన్నారు. తనపై పోస్టులు పెట్టిన వ్యక్తి ఎక్కడుంటాడో చూసుకోవాలని హితవు పలికారు. తన గురించి విమర్శించే వాళ్లు వాళ్ల గురించి ఆలోచించుకోవాలని సూచించారు రాజాసింగ్. తన మీద విమర్శలు చేసే అర్హత ప్రధాన కార్యదర్శి అశోక్ కు లేదన్నారు. గతంలో ఏబీవీపీ కార్యకర్తలపై కేసులు పెట్టిచ్చిన చరిత్ర అశోక్ దని చెప్పారు.నెలకు డబ్బులిచ్చి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ కార్యకర్తల గొంతుకగా తాను మాట్లాడుతున్నానని చెప్పారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాజీనామా చేస్తే.. నేను కూడా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. ఇద్దరం కలిసి ఎన్నికలకు వెళ్దాం. భాజపా నాకు ఎలాంటి సహకారాలు అందించలేదు. పార్టీలో నేను ఎలాంటి పదవి ఆశించలేదు. ఇప్పుడున్న కమిటీతో రాష్ట్రంలో భాజపా అధికారంలోకి రాదు. ఈ కమిటీతో అధికారంలోకి వస్తే రాజకీయ సన్యాసం చేస్తా. పార్టీని నాశనం చేస్తున్నదెవరో మరోసారి చెబుతా. ఢిల్లీ పెద్దలు నాకు తరచూ ఫోన్ చేసి మాట్లాడతారు. నాకు ఎప్పటి నుంచో కేంద్రంలోని పెద్దల ఆశీర్వాదం ఉంది. వాళ్లను కలిసి పార్టీలో జరిగిందంతా చెబుతా. నేను ఎప్పటికీ భాజపా నేతనే. సెక్యులర్ వాదిని కాదు. భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ పార్టీల్లో చేరను. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినందుకు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఫోన్ చేసి తిట్టారు. నేను చేసే కామెంట్స్ పార్టీపై కాదు.. కొందరు నేతలపై మాత్రమే. కార్యకర్తలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఢిల్లీ పెద్దలు పిలిస్తే వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నా అని రాజా సింగ్ తెలిపారు.




# లొట్టపీసు కేసులపై ముందుకెళ్లేదెలా?

రాజకీయ అవినీతిపై ఎవరు చర్యలు తీసుకోవాలి.. ఎక్కడ దీనికి అంతం పలకాలి. దేశంలో అవినీతి రాజ్యేలుతోంది. పక్కదేశాల్లో ప్రజల తిరుగుబాటు చూశాక పాలకులు కళ్లు తెరవాలి. మనకేం కాదులే అనుకుంటే కుదరదు. ప్రజాగ్రహం కట్టలు తెంచుకునే వరకు చూడకుండా జాగ్రత్త పడాలి. అధికారంలోకి రాగానే అక్రమంగా సంపాదించడం, అధికారం పోగానే లొట్టపీసు కేసుఅంటూ ఎగతాళి చేయడం అలవాటుగా మారింది. ఎపిలో జగన్, తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబం అవినీతి కట్టలు తెంచుకుంది. ఇలాంటి అవినీతి కేసులను త్వరగా విచారణ చేయడం ఇప్పుడున్న కోర్టుల పరిధి చాలదు. ఇలాంటి కేసుల్లో సకాలంలో విచారించి శిక్షలు పడేలా చేయాలి. కాళేశ్వరంలో రెండేళ్లుగా విచారణ సాగించి ఇప్పుడు సిబిఐకి అప్పగించారు. అలాగే ఈ ఫార్ములా కేసులో ఎసిబి ఇప్పుడు నివేదిక ఇచ్చింది. ఇవన్నీ చూస్తుంటే సత్వరంగా విచారణ చేసి శిక్షలు పడే దాఖలాలు కనిపించడం లేదు. తప్పు చేసి, అక్రమంగా డబ్బులు సంపాదించిన రాజకీయ నేతల్లో అందుకే ధీమా కనిపిస్తోంది. తమజీవిత కాలంలో విచారణలు జరిగి శిక్షలు పడవన్న ధీమాలో ఉన్నారు. అందుకే పరస్పర విమర్శలతో కాలం గడిపేస్తున్నారు. లొట్టపీసు కేసు అంటూ ఎగతాళి చేస్తున్నారు. ఈ ఫార్ములాలో అడ్డంగా దొరికిన కెటిఆర్ వ్యాఖ్యలు చూస్తే ఎవరికైనా ఒళ్లు మండుతుంది. క్విడ్‌ప్రోకో జరిగినట్లు స్పష్టంగా కనిపిస్తున్నా.. లొట్టపీసు కేసంటూ ముందునుంచీ ఎదురుదాడి చేస్తున్నారు. ప్రజలు కూడా పెద్దగా రాజకీయనేతల అవినీతిపై చర్చించడం లేదు. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో గత పాలకుల అవినీతి తారాస్థాయికి చేరింది. అలాగే రాష్ట్రాలను అప్పుల్లో ముంచారు. తాజాగా ఆర్థిక సంఘం ముందు తెలంగాణ ప్రభుత్వం కూడా అప్పుల గురించి ప్రస్తావించింది. కెసిఆర్, జగన్ పాలనలో అవినీతితో పాటు రెండు రాష్ట్రాలు అప్పుల్లో కూరుకు పోయాయి. విభజన కారణంగా ఈ రెండు కుటుంబాలు బాగా సంపాదించుకున్నాయని అక్కడ చంద్రబాబు..ఇక్కడ రేవంత్ రెడ్డిలు పదేపదే ఆరోపిస్తున్నారు. అవినీతి కారణంగా విభజిత రాష్ట్రాల్లో అభివృద్ధి పక్కకు పోయింది. అభివృద్ధి పేరుతో అప్పులు మిగిలాయి. అప్పులను రీ స్ట్రక్చర్ చేయాలని కేంద్రం ముందు దేబురిస్తున్నారు. విభజన కారణంగా ప్రజలకు మిగిలింది అప్పులే. ఇలా నేతలు ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు అప్పులు చేసి, రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా..కేంద్రం ప్రేక్షక పాత్ర పోషిస్తోంది. రాష్ట్రాలు చేసే అప్పులపై లేదా కేంద్రం చేసే అప్పులపై ఎక్కడా చెక్ లేకుండా పోయింది. అలాగే రాజకీయ నేతల అవినీతిపైనా కోర్టుల్లో కేసులు తేలడం లేదు. దీనిని నివారించి,రాజకీయాల్లో పారదర్శకతను, జవాబుదారీ తనాన్ని తీసుకుని రావాలని లోక్‌పాల్ అవసరం ఉందని గతంలోనే సామాజికవేత్త అన్నా హజారే పోరాటం చేసినా లాభం లేకుండా పోయింది. అన్నా ఉద్యమాన్ని హైజాక్ చేసి, ఆప్ పార్టీని పెట్టి అధికారంలోకి వచ్చిన కేజ్రీవాల్ ఇప్పుడు అవినీతి కేసులో ఇరుక్కుని జైలుజీవితం గడిపారు. అధికారం పోగట్టుకున్నారు. కాంగ్రెస్ అవినీతిని ప్రశ్నించిన కేజ్రీవాల్ ఇప్పుడు కాంగ్రెస్‌తో అంటకాగుతున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు జగన్, కెసిఆర్ అవినీతి అక్రమాలపై ఎవరు చర్యలు తీసుకోవాలి. ఎవరు కేసులు పెట్టాలన్నదే ప్రశ్న. గతంలో పదేపదే కెసిఆర్ అవినీతి గురించి మాట్లాడిన ప్రధాని మోడీ,అమిత్ షా ఇప్పుడు చప్పుడు చేయడం లేదు. ఇప్పుడు అన్నాహజారే లాగా ఎవరో ఒకరు ముందుకు రావాల్సి ఉంది. నేపాల్ హింసాత్మక ఘటనలు చూస్తుంటే ఆందోళన కలుగుతోంది. అదో చిన్నదేశమని ఊరుకోవడానికి లేదు. ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచఉకోకుండా పాలకులు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలి. అప్పులతో ప్రజలను మోసం చేస్తూ, ఉచిత పథకాలతో ఊరేగడం సరికాదు. ఎందుకంటే రాజకీయ నేతలు అధికారం కోసం ఉచిత తాయిలాలు ప్రకటించి అమలు చేయడంతో రాష్ట్రాలు దివాళా తీస్తున్నాయి. ఇది ఒక్క తెలుగు రాష్ట్రాల సమస్యే కాదు. దేశవ్యాప్తంగా ఉన్న సమస్య. ప్రతి రాష్ట్రంలోనూ ఇదే కనిపిస్తోంది. తప్పు ఎవరు చేసినా శిక్ష అనుభవించాల్సిందే. గతంలో కొన్ని కేసుల్లో ఉన్న జగన్ జైలుకు వెళ్లి వచ్చాక.. బెయిల్‌పై ఉంటూ సిఎంగా అధికారంలో ఉన్నారు. రాజకీయ నాయకులు తాము చేసే అక్రమాలపై సులువుగా తప్పించుకుంటున్నారు. లాలూ ప్రసాద్ యాదవ్ కేసునే తీసుకుంటే ఎన్నో ఏళ్లుగా ఇది నానుతోంది. కేసుల్లో బెయిల్‌పై ఉన్న వ్యక్తి సిఎం పోస్టుకు తగునా అన్నది కూడా చూడాలి. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ ఉదంతం, కాళేశ్వరం అవినీతి, విద్యుత్ పేరుతో లెక్కకు అందని అప్పులు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పేరుతో వేలకోట్లు ఊడ్చేశారు. చేపలు, గొర్రెల పంపకంతో కోట్లు మింగారు. తెలంగాణ ఉద్యమం పేరు చెప్పి తెలంగాణలో అధికారంలోకి వచ్చిన మహానుభావులు ఇప్పుడు ఈ అవినీతిపై మాట్లాడం లేదు. కేంద్రంలో పదవులు పొందిన ఇద్దరు మంత్రులు కూడా మాట్లాడడం లేదు. ఇలా నేరాలు చేసే వారంతా మన పాలకులు అవుతూ పోతుంటే ప్రజాస్వామ్యంలో నేర సామ్రాజ్యం రాజ్యమేలుతుంది. దీనికితోడు ఎపిలో అరాచకం, అక్రమాలు రాజ్యమేలాయి. కక్షపూరి రాజకీయాలు రాజ్యమేలుతున్న కాలమిది. హుందా రాజకీయాలను పక్కన పెట్టారు. రాజకీయ నేతలు అవినీతికి పాల్పడితే తాటతీయాల్సిందే. జగన్ పాలనలో జరిగిన ఇసుక, మైనింగ్ మాఫియాలనపైనా చర్యలు తీసుకోవాలి. ఎపి కావచ్చు..తెలంగాణ కావచ్చు... అవినీతి కేసుల్లో ఎవరు ఉన్నా నిగ్గు తేల్చాల్సిందే. ఇలాంటి సదర్భాల్లో కేంద్రంలో ప్రత్యేక వ్యవస్థ ఉండాలి. పాలకులు ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నా విచారణ జరపాల్సిందే. లోక్‌పాల్ బిల్లు తెస్తే తప్ప రాజకీయ నాయకుల ఆటలు కట్టించలేం. రాజకీయ అవినీతిపై ప్రత్యేక కోర్టులు ఉండాలి. రాజకీయ అవినీతిని అరికడితే తప్ప మనదేశం దరిద్రం తీరదు. చంద్రబాబు కావచ్చు.. జగన్ కావచ్చు..కెసిఆర్ కావచ్చు..అవినీతి ఎవరిదైనా సత్వర విచారణ చేయించి బొక్కలో తోయాల్సిందే. పాలకులన్న వారు నిజాయితీగా ఉండేలా మన చట్టాలు ఉండాలి. అక్రమ సంపాదనలపై నిఘా కన్ను వేయాలి. లోక్‌పాల్ వ్యవస్థను తీసుకుని రావాలన్న అన్నా హజారే డిమాండ్‌ను ప్రధాని మోడీ పక్కన పెట్టారు. లోక్‌పాల్ వ్యవస్థను తీసుకుని రావడంతో పాటు రాజకీయ నేతల అవినీతి కేసుల్లో త్వరగా విచారణ జరిపి, తీర్పులు వచ్చేలా ప్రత్యేక చట్టాలు ఏర్పాటు చేసుకోవాలి. ఏడాదిలోగా ఎలాంటి కేసుకైనా విచారణ ముగించి తీర్పు వచ్చేలా వ్యవస్థలను బలోపేతం చేయాలి. కఠిన శిక్షలు అమలు చేయాలి. చైనాలోలాగా కఠిన శిక్షలు వేస్తూ పోతే తప్ప రాకీయ అవినీతికి చరమగీతం పాడలేం. కవిత లిక్కర్ స్కామ్ తీసుకుంటే ఇడి,సిబిఐ అధికారులు కేసు నిగ్గు తేల్చలేదు. రాజీకయ పార్టీల నేతలంతా ఒకే తాను ముక్కలు కావడంతో లోక్‌పాల్ వ్యవస్థను తీసుకుని రావడం లేదు. అది వస్తే తప్ప రాజకీయ అవినీతికి కళ్లెం పడదు.

# ఆర్మీ గుప్పెట్లోకి నేపాల్ పాలన

- రాజ్యాంగాన్ని తిరగా రాయాలంటున్న జెన్ జడ్
- సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం చేసిన భారత్






**ఖాట్మండ్, సెప్టెంబర్ 10:** హిమాలయ హిందూ దేశం ఆర్మీ చేతుల్లోకి వెళ్లింది. ఆర్మీ కంట్రోల్ చేసేందుకు అధికారాన్ని తన చేతుల్లోకి తీసుకుంది. జెన్–జడ్ ఆగ్రహంతో అల్లకల్లోలమైన నేపాల్‌లో పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చేందుకు ఆ దేశ ఆర్మీ రంగంలోకి దిగింది. కర్ఫ్యూ ప్రకటించింది. మరోవైపు, నేపాల్ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్నిరసనకారుల బృందంతో సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో యువ ఆందోళనకారులు తమ డిమాండ్లను వెల్లడించారు. రాజ్యాంగాన్ని తిరిగిరాయాలని డిమాండ్ చేశారు. ఈ యువతరంగం నేపాల్ పాలనలో సమూల మార్పులు ఆశిస్తోంది. దానికి తగ్గట్టుగా కొన్ని డిమాండ్లను ముందుంచింది. ఈ ఉద్యమం ఒక పార్టీ, ఒక వ్యక్తి కోసం కాదు. మొత్తం ఒక జనరేషన్, దేశ భవిష్యత్తు కోసం. కొత్త రాజకీయ వ్యవస్థ ఆధారంగానే శాంతి నెలకొంటుంది. అధ్యక్షుడు, నేపాల్ సైన్యం మా ప్రతిపాదనలను సానుకూలంగా అమలుచేస్తుందని భావిస్తున్నామని ఓ ప్రకటనలో వారు పేర్కొన్నారు. ప్రస్తుత రాజ్యాంగాన్ని తిరిగి రాయాలని, మూడు దశాబ్దాలుగా రాజకీయ పార్టీలు సాగించిన అవినీతిపై దర్యాప్తు జరపాలని కోరుతున్నారు. అలాగే ఈ ఆందోళనల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని అమరులుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. నిరుద్యోగాన్ని పారదోలేందుకు, వలసలు అరికట్టేందుకు, సామాజిక అన్యాయాన్ని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. వీరి బృందం ఆర్మీ ప్రతినిధులతో కలిసి అధ్యక్షుడిని కలవనుంది. ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోన్న భారత్.. సరిహద్దుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేసింది. సామాజిక మాధ్యమాలపై నేపాల్ ప్రభుత్వం నిషేధం విధించడంతో ఒక్కసారిగా పెల్లుబికిన ఆందోళనల తీవ్రతకు కేపీ శర్మ ఓలీ ప్రధాని పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ప్రజలంతా ఇళ్లల్లోనే ఉండాలని కోరారు. నిరసనకారులు చర్చలకు రావాలని చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ అశోక్ రాజ్ సిగ్దెల్ పిలుపునిచ్చారు. ఈ కర్ఫ్యూ వేళ.. విధ్వంసం, దోపిడీ, దాడులు వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నేపాల్ ను ఆనుకొని ఉన్న సరిహద్దు ప్రాంతాల్లో మన దేశం భద్రతను పెంచింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని సరిహద్దు జిల్లాల్లో మార్కెట్లు–మూగబోయాయి. తమ రోజువారీ జీవనానికి ఆటంకం ఏర్పడటంతో స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

## నేపాల్‌లో చిక్కుకున్న భారత పర్యాటకులు

### పర్యాటకులను కూడా వదలని ఆందోళనకారులు



**ఖాట్మండ్, సెప్టెంబర్ 10:** నేపాల్‌లో జెన్–జడ్ నిరసనలు హింసాత్మక పరిస్థితులను సృష్టించాయి. ప్రభుత్వ, ప్రైవేటు– ఆస్తులకు ఆందోళనకారులు నిప్పంటించారు. పొఖారా ప్రాంతంలో ఉన్న హోటల్‌పై వారు దాడికి దిగారు. దాంతో అందులో బస చేస్తోన్న భారత పర్యాటకురాలు ఉపాసన గిల్ తనకు సహాయం చేయాలంటూ భారత ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారు. దానికి సంబంధించిన వీడియో ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. ఉపాసన గిల్ వాలీబాల్ లీగ్ కోసం నేపాల్ వచ్చారు. నిరసనలతో పొఖారా ప్రాంతంలో ఉన్న హోటల్‌లో చిక్కుకుపోయాను. తొలుత నేను బస చేసిన హోటల్‌కు నిప్పంటించారు. నా వస్తువులన్నీ అందులోనే ఉండిపోయాయి. దాడి సమయంలో నేను స్పాలో ఉన్నాను. కొందరు నిరసనకారులు పెద్ద పెద్ద కర్రలతో నా వెనకే దూసుకొచ్చారని గిల్ వాపోయారు. వారినుంచి ఎలాగోలా ప్రాణాలు కాపాడుకున్న ఆమె.. సహాయం కోసం భారత ప్రభుత్వాన్ని అర్థించారు. ప్రస్తుతం పరిస్థితులు ఏమాత్రం బాగా లేవని, రోడ్డుపై ఎక్కడ చూసినా మంటలే కనిపిస్తున్నాయని వెల్లడించారు. వారు పర్యాటకులను కూడా వదలడం లేదు. ఎలాంటి ఆలోచన లేకుండా ప్రతిదీ తగలబెడుతున్నారు. పరిస్థితి ఎలా ఉంటుందో తెలియడం లేదు. నాతోపాటు– చాలామంది సహాయం కోసం ఎదురుచూస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఇక ఇప్పటికే నేపాల్ లో ఉన్న భారతీయులను స్వదేశానికి రప్పించేందుకు భారత ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అక్కడి రాయబార కార్యాలయం హెల్ప్‌లైన్ నంబర్లను వెల్లడించింది. అలాగే పరిస్థితులు చక్కబడేవరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించింది. ప్రస్తుతం ఉన్నచోటే ఉండాలని, వీధుల్లోకి రావొద్దని హెచ్చరించింది. ఎప్పటికప్పుడు స్థానిక యంత్రాంగం ఇచ్చే సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. నేపాల్ సరిహద్దుల్లో ఉన్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని సొనౌలీ ప్రాంతం మీదుగా భారతీయ పర్యాటకులు తిరిగి స్వదేశానికి వస్తున్నారు. అక్కడ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వారంతా తమ పర్యటనను అర్ధంతరంగా ముగించుకొన్నారు. ఇదిలాఉంటే.. చర్చల ద్వారా శాంతియుత పరిష్కారానికి కృషి చేయాలని అధ్యక్షుడు, ఆర్మీ నిరసనకారులను కోరింది. ప్రస్తుతం అక్కడ ఆర్మీ కర్ఫ్యూ ప్రకటించింది. నేపాల్ వెంబడి ఉన్న సరిహద్దు ప్రాంతాల్లో భారత్ భద్రతను కట్టుదిట్టం చేసింది.

## నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసులకు అండ

### తెలంగాణ భవన్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు





**హైదరాబాద్, సెప్టెంబర్ 10:** నేపాల్‌లో అల్లర్లు, రాజకీయ అస్థిరత నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం అక్కడి పౌరులకు అండగా నిలిచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఒక ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ పౌరులకు, వారి కుటుంబ సభ్యులకు సహాయం అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతానికి, ఏ తెలంగాణ పౌరుడికి గానీ గాయాలు లేదా అదృశ్యమైనట్లు ఎలాంటి నివేదికలు అందలేదు.అయినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ, అలాగే కాఠ్మండులోని భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ, అక్కడ ఉన్న తమ పౌరుల భద్రతను, అలాగే వారిని సురక్షితంగా వెనక్కి రప్పించే ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది.సహాయం కోసం తెలంగాణ పౌరులు ఈ క్రింది అధికారులను సంప్రదించవచ్చని సూచించింది. ప్రైవేట్ సెక్రటరీ, రెసిడెంట్ కమిషనర్ లైజన్ హెడ్ వందన. ఫోన్: 91 9871999044. లైజన్ ఆఫీసర్ జి. రక్షిత్ నాయక్ ఫోన్: 91 9643723157. పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ చక్రవర్తి.. ఫోన్: 91 9949351270. పౌరులందరూ అధికారిక ప్రకటనలను మాత్రమే అనుసరించాలని, ధృవీకరించని సమాచారాన్ని నమ్మవద్దని, ఇతరులకు పంపవద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో తన ప్రజల భద్రత, సంక్షేమం పట్ల తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతతో ఉందని ఈ సందర్భంగా పేర్కొంది.

## మెల్లగా స్వరం మారుస్తున్న ట్రంప్

### భారత్‌తో సుంకాలపై చర్చిస్తామని సూచన

**వాషింగ్టన్, సెప్టెంబర్ 10:** సుంకాలకు సంబంధించి ఇటీవలి వరకు భారత్‌పై ఘాటు– వ్యాఖ్యలు చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వరం రోజురోజుకు మారుతోంది. ఆయన మళ్లీ భారత్‌కు చేరువ కావాలని తపిస్తున్నారు. తాజాగా తన సోషల్ మీడియా 'ట్రూత్' వేదికగా మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా, భారత్ మధ్య వాణిజ్య అడ్డంకులను పరిష్కరించడానికి తన పరిపాలన విభాగం ఇండియాతో చర్చలు కొనసాగిస్తోందని పేర్కొన్నారు. ఈ అంశంపై తన మిత్రుడైన భారత ప్రధాని మోదీతో వచ్చే కొన్ని వారాల్లోనే మాట్లాడేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు– తెలిపారు. ఈ చర్చలు రెండు గొప్పదేశాలకు మంచి ఫలితాలు ఇస్తాయని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. రష్యా నుంచి అధికస్థాయిలో భారత్ చమురును దిగుమతి చేసుకొని విదేశాలకు అమ్ముతూ ఇటీవలి వరకు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సుకు ఇటీ–వల హాజరైన ప్రధాని మోదీ అక్కడ చైనా అధ్యక్షుడు అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ద్వైపాక్షిక భేటీలు నిర్వహించారు. ఈ భేటీ– అనంతరం చైనా చీకటి వలయంలో భారత్ చిక్కుకున్నట్లు ట్రంప్ విమర్శలు గుప్పించారు. అనంతరం కొన్ని గంటల్లోనే తన స్వరం మార్చారు. భారత్, అమెరికా మధ్య బంధం చాలా ప్రత్యేకమైందని పేర్కొన్నారు. దాని గురించి ఆందోళన చెందనక్కర్లేదని తెలిపారు. ప్రధాని మోదీని ప్రశంసలతో ముంచెత్తారు. మోదీ గొప్ప ప్రధానమంత్రి అని కొనియాడారు. మోదీకి తానెప్పుడూ స్నేహితుడినన్నారు.


## నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ చైర్మన్‌గా తెలుగు తేజం ఇంజేటి శ్రీనివాస్



**ఢిల్లీ, సెప్టెంబర్ 10 :** ఒడిశా కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి, ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్స్ అథారిటీ (ఐఎఫ్ఎస్సీఏ) మాజీ వ్యవస్థాపక చైర్మన్ ఇంజేటి శ్రీనివాస్.. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) చైర్మన్‌గా నియమితులయ్యారు. మంగళవారం నుంచే ఈ నియామకం అమలు లోకి వచ్చింది. రెండేళ్లుగా ఎన్ఎస్ఈకి సారథి లేరు.. తొలి పబ్లిక్ ఇష్యూకి (ఐపీఓ) ఎక్స్ఛేంజీ సిద్ధం అవుతున్న సమయంలో తెలుగు మూలాలున్న శ్రీనివాస్ నియామకం జరిగింది. ఆయన ఇటీవల ఎన్ఎస్ఈలో పబ్లిక్ ఇంటరెస్ట్ డైరెక్టర్గా చేరారు. గతంలో ఆయన కార్పొరేట్ వ్యవహారాల శాఖ కార్యదర్శిగా కూడా పని చేశారు. కార్పొరేట్, ఆర్థిక నియంత్రణలు, పారిశ్రామిక ప్రోత్సాహం, కార్పొరేట్, దివాలా చట్టం, కాంపిటీషన్ చట్టం, చార్టెడ్ అకౌంటెన్సీ, కాస్ట్ అకౌంటెన్సీ వంటి భిన్న రంగాల్లో ఆయనకు నాలుగు దశాబ్దాలకు పైబడిన అనుభవం ఉంది. ఢిల్లీ లోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ నుంచి బీఏ (హానర్స్) పూర్తి చేసిన శ్రీనివాస్ 1983లో ఒడిశా కేడర్ అధికారిగా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు.

## బంగారం ధరలు మరింత పైపైకి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10:** బంగారం కొనాలనుకునే వారికి వరుసగా షాక్ తగులుతోంది. బంగారం ధర ఆల్–టైమ్ గరిష్టానికి చేరింది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 10, 300కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 01, 100కి చేరింది ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు– 10 గ్రాములకు రూ. 1, 10, 450కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 01, 260కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 10, 300కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు– రూ. 1, 01, 100కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే కేజీకి వంద రూపాయల మేర పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లలో స్వల్ప మార్పులు ఉన్నా పెద్దగా తేడాలేదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.



## అహ్మదాబాద్‌లో ఫైనల్

### టీ20 ప్రపంచకప్ 2026 తేదీలు ఖరారు..!

### ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు మ్యాచ్‌లు

భారత్, శ్రీలంక వేదికగా వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ జరగనున్న విషయం తెలిసిందే. అయితే ఈ టోర్నీకి సంబంధించిన షెడ్యూల్‌ను ఐసీసీ ఖరారు చేసినట్లు సమాచారం. ఈ మేరకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నీ జరగనున్నట్లు తెలుస్తోంది. దీన్ని బట్టి చూస్తే.. ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే.. ఈ పొట్టి ప్రపంచకప్ జరగనుంది! ఈ మెగా ఈవెంట్‌లో మొత్తం 20 జట్లు పాల్గొంటాయి. ఈ ఈవెంట్‌లోని మ్యాచ్‌లు శ్రీలంకతో పాటు.. భారత్‌లో జరగనున్నాయి. ఫైనల్ మ్యాచ్ గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరగనున్నట్లు సమాచారం. ఒకవేళ పాకిస్థాన్ ఫైనల్ చేరితే.. శ్రీలంకలోని కొలంబోలో మ్యాచ్ జరుగుతుంది. టీ20 ప్రపంచకప్ 2026లో మొత్తం 20 జట్లు పాల్గొంటాయి. అందులో ఇప్పటికే 15 టీమ్స్ ఖరారు అయ్యాయి. అవి భారత్, శ్రీలంక, అఫ్ఘానిస్థఆన్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, యూఎస్ఏ, వెస్టిండీస్, న్యూజిలాండ్, పాకిస్థాన్, ఐర్లాండ్, కెనడా, నెదర్లాండ్స్, ఇటలీ. మిగిలిన ఐదు జట్లు ఆఫ్రికన్, ఆసియా, తూర్పు ఆసియా పసిఫిక్ క్వాలిఫయర్స్ నుంచి అర్హత సాధించనున్నాయి. 20 జట్లను మొత్తంగా నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. అందులో భాగంగా ప్రతి గ్రూప్‌లో ఐదేసి జట్ల చొప్పున ఉంటాయి. లీగ్ స్టేజ్‌లో ప్రతీ జట్టు 4 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. లీగ్ దశ ముగిసే సరికి.. ప్రతి గ్రూపులో టాప్-2లో నిలిచే జట్లు సూపర్-8కు క్వాలిఫై అవుతాయి. సూపర్-8 రౌండ్‌లో టాప్-4 జట్లు సెమీఫైనల్‌కు చేరుకుంటాయి. ఆ తర్వాత ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. ఈ ప్రపంచకప్‌లో మొత్తంగా 55 మ్యాచ్‌లు జరగనున్నట్లు తెలుస్తోంది. షెడ్యూల్.. ఫిబ్రవరి, మార్చి మధ్యలోనే ఉండే అవకాశం ఉంది. ఎందుకంటే జనవరి 11 నుంచి 31 వరకు భారత్, న్యూజిలాండ్ మధ్య వన్డే, టీ20 సిరీస్‌లు జరుగుతాయి. ఐపీఎల్ విండో మార్చి 15 నుంచి 31 వరకు ఉంటుంది. దీంతో ఫిబ్రవరి మొదటి వారంలో టీ20 ప్రపంచకప్ ప్రారంభించి.. ఐపీఎల్ ప్రారంభం కాకముందే టీ20 ప్రపంచకప్‌ను ముగించే అవకాశం ఉంది.

## భారత్‌కు గట్టి పోటీనిచ్చే జట్లే లేవు

### రవిచంద్రన్ అశ్విన్ సంచలన వ్యాఖ్యలు



ఆసియా కప్ 2025 టోర్నీపై టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఈ టోర్నీతో ఉపయోగమే లేదని, భారత్‌కు గట్టి పోటీనిచ్చే జట్లే లేవన్నాడు. కనీసం సౌతాఫ్రికా, భారత్-ఏ జట్లను అయినా చేర్చి ఉంటే టోర్నీ రసవత్తరంగా సాగేదని అభిప్రాయపడ్డాడు. టీ20 ఫార్మాట్‌లో ఆసియా కప్ 2025 టోర్నీ మంగళవారం ప్రారంభమైన విషయం తెలిసిందే. తొలి మ్యాచ్‌లో అఫ్గాన్, హాంగ్ కాంగ్ తలపడ్డాయి. అయితే ఈ మ్యాచ్ పూర్తి ఏకపక్షంగా సాగింది. బుధవారం ఆతిథ్య యూఏఈతో భారత్ తలపడనుంది. ఈ క్రమంలోనే అశ్విన్ చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఆసియా కప్ 2025లో అసలు సిసలు పోటీ ఎక్కడా? అని అశ్విన్ ప్రశ్నించాడు. రోజు రోజుకు ఈ టోర్నీ ప్రమాణాలు పడిపోతున్నాయంటూ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. టీ20 ప్రపంచకప్ 2026కు సన్నాహకంగా ఈ టోర్నీని ఉపయోగపడుతుందని అనుకోవడం సరికాదన్నాడు. 'ఆసియా కప్ టోర్నీని మరింత రసవత్తరంగా మార్చాలంటే చాలా మార్పులు చేయాలి. ఈ ఎడిషన్‌లో సౌతాఫ్రికా జట్టును చేర్చి ఆఫ్రో-అసియా కప్‌గా నిర్వహిస్తే బాగుండేది. కనీసం భారత్-ఏ జట్టును అయినా అదనంగా బరిలోకి దింపినా రసవత్తర పోరు ఉండేది. బంగ్లాదేశ్ గురించి ఎక్కువగా మాట్లాడలేం. ఆ జట్టులో పెద్దగా ఏమీ లేదు. ఇతర జట్ల సంగతి కూడా సరేసరి. ఇవన్నీ భారత్‌కు ఏ మాత్రం పోటీనివ్వగలవు..?చాలామంది అనుకున్నట్లుగా వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ కప్ కోసం సన్నద్ధమయ్యేందుకు ఈ టోర్నీ ఏ మాత్రం కీలకం కాదు. ఇందులో పెద్ద పోటీనే ఉండదు. అఫ్గానిస్థాన్ బౌలింగ్‌ను చూశాక నాకు ఇదే అభిప్రాయం కలిగింది. ఒకవేళ భారత్‌తో మ్యాచ్‌లో 170ం పరుగుల లక్ష్యం ఎదురైతే అఫ్గాన్ ఛేదించగలదా? అసాధ్యం అనుకుంటున్నా. టీమిండియాను ఓడించాలంటే ఏ జట్టుకైనా ఆ రోజు బాగా కలిసిరావాలి. టీ20ల్లో చివరివరకూ థ్రిల్లింగ్‌గా జరుగుతాయి. కానీ, ఆసియా కప్‌లోనూ భారత్ మ్యాచ్‌లు ఏకపక్షమే.'అని అశ్విన్ పేర్కొన్నాడు.

# భారత్ శుభారంభం

### అభిషేక్ సిక్సర్ల మోత.. యూఏఈకి ముచ్చెమటలు పట్టించిన టీమిండియా

### 4.3 ఓవర్లలోనే మ్యాచ్ ముగించిన భారత్



పదిహేడో సీజన్ ఆసియా కప్‌ను భారత జట్టు అదిరపోయేలా ఆరంభించింది. బ్యాటింగ్, బౌలింగ్ రెండు విభాగాల్లో దడ పుట్టిస్తూ యూఏఈకి ముచ్చెమటలు పట్టించిన టీమిండియా.. ప్రత్యర్థులకు వణుకు పుట్టించే విజయంతో టోర్నీలో ఘనంగా శుభారంభం చేసింది. తొలుత కుల్దీప్ యాదవ్ (4-7), శివం దూబే(4-3)ల విజృంభణతో ప్రత్యర్థి 57కే పరిమితం అవ్వగా.. స్వల్ప ఛేదనలో ఓపెనర్ అభిషేక్ శర్మ(30) సిక్సర్లతో చెలరేగాడు. శుభ్‌మన్ గిల్(19 నాటౌట్) సైతం దంచేయడంతో.. 4.3 ఓవర్లలోనే జయభేరి మోగించింది. 9 వికెట్ల తేడాతో గెలుపొందిన టీమిండియా గ్రూప్ ఏ నుంచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది.

డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ ఆసియా కప్‌ను భారీ విజయంతో మొదలు పెట్టింది. టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన టీమిండియా సంచలన బౌలింగ్ ప్రదర్శనతో ప్రత్యర్థికి దిమ్మతిరిగే షాకిచ్చింది. 58 పరుగుల ఛేదనలో ఓపెనర్ అభిషేక్ శర్మ తొలి బంతినే సిక్సర్‌గా మలిచాడు. ఆ తర్వాత బంతికి ఫోర్ బాదగా.. రెండో ఓవర్లో శుభ్‌మన్ గిల్(19 నాటౌట్) ఫోర్, సిక్సర్ కొట్టడంతో చూస్తుండానే లక్ష్యం కరిగిపోయింది.



జునైద్ సిద్దిఖీ వేసిన నాలుగో ఓవర్లో సిక్సర్ రాబట్టిన అభిషేక్.. ఆ తర్వాత బంతికి ఔటయ్యాడు. అతడు వెనుదిరిగే సరికి టీమిండియా స్కోర్.. 48/1. విజయానికి పది పరుగులు మాత్రమే అవసరం కాగా.. క్రీజులోకి వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (7 నాటౌట్) ఎదుర్కొన్న మొదటి బంతినే స్టాండ్స్‌లోకి పంపాడు. నాలుగో ఓవర్ మూడో బంతిని గిల్ బౌండరీకి తరలించగా.. యూఏఈ జట్టు దారుణంగా ఓడిపోయింది.

**కుల్దీప్.. దూబే పడగొట్టారిలా**

టాస్ గెలిచి బౌలింగ్ తీసుకున్న టీమిండియా యూఏఈని స్వల్ప స్కోర్‌కే కట్టడి చేసింది. మొదట ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఓపెనర్ అలీషాన్ షరుఫు(22)ను ఔట్ చేసి జట్టుకు తొలి వికెట్ అందించాడు. దూకుడుగా ఆడుతున్న అతడిని యార్కర్ కింగ్ క్లీన్ బౌల్డ్ చేయడంతో.. 26వద్ద ఆతిథ్య జట్టు మొదటి వికెట్ కోల్పోయింది. కాసేపటికే బంతి అందుకున్న వరుణ్ చక్రవర్తి ముహమ్మద్ జొహైబ్(2)ను డగౌట్ చేర్చాడు. ఆ తర్వాత కుల్దీప్ యాదవ్ (4-7), శివం దూబే(4-3)లు మ్యాజిక్ చేశారు.

చైనామన్ బౌలర్ కుల్దీప్ విజృంభణతో 9వ ఓవర్లో రాహుల్ చోప్రా(3), కెప్టెన్ ముహమ్మద్ వసీం(19), హర్షిత్ కౌశిక్(2)లు వెనుదిరిగారు. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే అక్షర్ పటేల్(13-1), దూబేలు మరో ఎండ్ నుంచి వికెట్ల వేట సాగించారు. 13వ ఓవర్లో రెండు వికెట్లు తీసిన దూబే ప్రత్యర్థిని ఆలౌట్ అంచున నిలిపాడు. చివరి వికెట్‌గా వచ్చిన హైదర్ అలీ(1)ని కుల్దీప్ ఔట్ చేయగా 57కే యూఈఏ ఇన్నింగ్స్ ముగిసింది.

## ఓ క్రికెటర్ నగ్న ఫోటో పంపించాడు

### అనయ సంచలన ఆరోపణలు



టీమిండియా మాజీ ఆటగాడు సంజయ్ బంగర్ కుమారుడు ఆర్యన్ అమ్మాయిగా మారిన విషయం తెలిసిందే. తన పేరును అనయగా మార్చుకున్నాడు . అమెజాన్ ఎంఎక్స్ ప్లేయర్ నిర్వహిస్తున్న 'రైజ్ అండ్ ఫాల్' షోలో తను సంచలన విషయాన్ని వెల్లడించింది. తనకు ఓ క్రికెటర్ నగ్న ఫోటో పంపినట్లు తెలిపింది. నేను నవంబర్‌లో అబ్బాయి నుంచి అమ్మాయిగా మారి బహిరంగంగా బయటకు వచ్చాను. డిసెంబర్-జనవరి నాటికి నేను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ప్రారంభించాను. నా మనసులో ఏముందో దాన్ని పోస్ట్ చేస్తున్నాను. ఒక క్రికెటర్ నాతో మాట్లాడటం ప్రారంభించాడు అని అనయ అన్నారు. అతను ఆ రకమైన ఫోటోను డైరెక్ట్‌గా పంపించాడు అని అనయ చెప్పింది. 'ఏ రకమైన ఫోటో? నగ్న ఫోటో?' అని ఆ షోలో పాల్గొన్న మరో వ్యక్తి అడిగాడు. దీనికి అనయ 'అర్థం చేసుకోండి' అని చెప్పింది. మరొక వ్యక్తి 'ఆ క్రికెటర్ అందరికీ తెలుసా?' అని అడిగినప్పుడు అనయ 'అందరికీ అతన్ని తెలుసు' అని చెప్పింది. ఇది విని అందరూ షాక్ అయ్యారు. అనయకు నగ్న ఫోటో పంపిన క్రికెటర్ ఎవరు అనేది ఇప్పుడు అందరినీ వేధించే ప్రశ్నగా మారింది.

## బీసీసీఐకి ఉత్తరాఖండ్ హైకోర్టు నోటీసులు



ఉత్తరాఖండ్ హైకోర్టు బీసీసీఐకి మంగళవారం నోటీసులిచ్చింది. ఆ రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.12 కోట్లను క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఉత్తరాఖండ్ దుర్వినియోగం చేసిందనే ఆరోపణలపై దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్లపై స్పందించిన హైకోర్టు బీసీసీఐకి నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ ఆఫ్ ఉత్తరాఖండ్? ఆడిట్ రిపోర్ట్? ఆధారంగా ఆటగాళ్లకు అరటిపండ్ల కోసం రూ.35 లక్షలకు ఖర్చు చేశారని పిటిషనర్ ఆరోపించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఉత్తరాఖండ్? అకౌంట్స్?పై దర్యాప్తు కోరుతూ డెహ్రాడున్?కు చెందిన సంజయ్ రావత్ సహా మరికొందరు హైకోర్టులో పిటిషన్ వేశారు. పిటిషనర్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఉత్తరాఖండ్? ఆడిట్ రిపోర్ట్?ను హైలైట్ చేస్తూ, అందులో ఖర్చులు చూసి షాక్?కు గురైనట్లు పేర్కొన్నారు. కేవలం ప్లేయర్లకు అరటిపండ్లు అందించేందుకే రూ.35 లక్షలు ఖర్చైనట్లు ఆడిట్ రిపోర్ట్?లో ఉన్నట్లు తెలిపారు. అందుకే ఆ రాష్ట్ర క్రికెట్ బోర్డు ఆడిట్ రిపోర్ట్?పై దర్యాప్తు చేపట్టాలని పిటిషన్?లో పేర్కొన్నారు. క్రికెట్ డెవలప్?మెంట్ కోసం కేటాయించిన ఆ నిధులను, కొందరు వ్యక్తిగత బెనిఫిట్ కోసం దుర్వినియోగం చేశారని అన్నారు. ఆహార ఖర్చుల ముసుగులో అసోసియేషన్ కోట్లు స్వాహా చేసిందని, రాష్ట్ర ఆటగాళ్లకు తగిన సౌకర్యాలు ఎప్పుడూ కల్పించలేదని పిటిషనర్లు ఆరోపించారు. కాగా, సింగిల్ బెంచ్ జస్టిస్ మనోజ్ తివారి ఈ పిటిషన్లపై వాదనలు విన్నారు. ఇక ఈ ఆరోపణలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. రాష్ట్ర క్రికెట్ బోర్డు నిర్వహించే టోర్నమెంట్?లకు కూడా బోర్డు భారీగా ఖర్చు చేసిందని ఆరోపించారు. ఆడిట్ రిపోర్ట్ ఆధారంగా, రూ.6.4 కోట్లు ఈవెంట్ మేనేజ్?మెంట్ ఫీజులు, రూ.26.3 కోట్లు టోర్నమెంట్ల నిర్వహణ, ట్రైయల్ మ్యాచ్?లు ఇతరత్రా అవసరాలకు ఖర్చు అయ్యింది. అయితే గతేడాది ఈ ఖర్చు రూ. 22.30 కోట్లే ఉంది. కాగా, ఇదే నెల 5న బోర్డుకు సంబంధించి మరో పిటిషన్? హైకోర్టుకు ముందుకు వచ్చింది. 2025 సీజన్?కు సంబంధించి ఉత్తరాఖండ్ ప్రీమియర్ లీగ్?లో టెండర్ల వ్యవహారంపైనా కోర్టులో వాదనలు జరిగాయి. టెండర్ల ప్రక్రియ సరైన విధానంలో జరగడం లేదని, కావాలని ఒకే కంపెనీకి టెండర్లు దక్కేలా చేస్తున్నారని క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఉత్తరాఖండ్? ఉపాధ్యక్షుడు సురేంద్ర బండారి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్?పై స్పందించిన హైకోర్టు దీనిపై తమ సమాధానం తెలపాలని జస్టిస్ నరేందర్, జస్టిస్ సుభాష్ బెంచ్ బీసీసీఐ, క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఉత్తరాఖండ్? బోర్డు అధికారులకు నోటీసులు పంపించింది. అలాగే 2019లోనే క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఉత్తరాఖండ్?కు బీసీసీఐ గుర్తింపు లభించిందని, అప్పట్నుంచి రాష్ట్ర బోర్డుకు జాతీయ క్రికెట్ అసోసియేషన్? నుంచి రూ.22 కోట్లకు పైగా నిధులు వచ్చాయని ఉపాధ్యక్షుడు సురేంద్ర బండారి పిటిషన్?లో పేర్కొన్నారు. అయితే ఆ నిధులను కొందరు అధికారులు తమ స్వార్థం కోసం పక్కదారి పట్టించారని ఆరోపించారు. అంతేకాకుండా అధికారులు అసోసియేషన్?లో ఎలాంటి అభివృద్ధి చేయరని, ప్లేయర్లకు సరైన సౌకర్యాలు కల్పించరని అన్నారు. అందుకు బదులుగా ప్లేయర్లకు కేవలం నీళ్లు, అరటిపండ్లనే ఇస్తారని తెలిపారు.

# వివాదంలో నయనతార డాక్యుమెంటరీ

## చంద్రముఖి క్లిప్స్ వాడకంపై మద్రాస్ హైకోర్టు నోటీసులు

లేడి సూపర్‌స్టార్ నయనతార మరోసారి వివాదంలో చిక్కుకుంది. ఆమె నటించిన డాక్యుమెంటరీ 'నయనతార: బియాండ్ ది ఫెయిరీటేల్ ' ఇప్పటికే పలు వివాదాలను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. తమ అనుమతి లేకుండా 'నానుమ్ రౌడీ దాన్' సినిమా క్లిప్‌లను ఉపయోగించారని ఆ సినిమా నిర్మాత ధనుష్ అప్పట్లో నయనతారపై రూ. 10 కోట్ల పరువు నష్టం దావా వేశాడు. అయితే ఈ వివాదం ముగియకముందే తాజాగా మరో కేసులో ఇరుక్కుంది నయన్. ఈ డాక్యుమెంటరీలో తమ అనుమతి లేకుండా 'చంద్రముఖి' సినిమాలోని క్లిప్‌లను ఉపయోగించారంటూ 'ఏపీ ఇంటర్నేషనల్' అనే సంస్థ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. చంద్రముఖి' సినిమా హక్కులు తమ వద్ద ఉన్నాయని, తమ అనుమతి లేకుండా డాక్యుమెంటరీలో ఆ సినిమా క్లిప్‌లను వాడారని పిటిషనర్లు పేర్కొన్నారు. దీనిపై నయనతార, నెట్‌ఫ్లిక్స్‌కు రూ. 5 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అయి-ంతే ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ఈ వివాదంపై సమాధానం ఇవ్వాలని నయనతార, నెట్‌ఫ్లిక్స్‌లకు నోటీసులు జారీ చేసింది. దీనిపై అక్టోబర్ 6 లోపు స్పష్టత ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. కాగా ఈ రెండు వివాదాలతో నయనతార డాక్యుమెంటరీ ఇప్పుడు కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తమ అనుమతి లేకుండా ఆ డాక్యుమెంటరీలో 'చంద్రముఖి' సన్నివేశాలు ప్రదర్శించడంపై నిర్మాణ సంస్థ 'ఏబీ ఇంటర్నేషనల్' మద్రాసు హైకోర్టును ఆశ్రయించింది. ఆ పిటిషన్ బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. దీనిపై అక్టోబరు 6లోపు సమాధానమివ్వాలని డాక్యుమెంటరీని నిర్మించిన 'టార్క్ స్టూడియోస్'కు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ఆ సన్నివేశాలను తొలగించాలని, రూ.5 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని ఇప్పటికే నోటీసులు జారీ చేసినా తమ కంటెంట్‌తో డాక్యుమెంటరీ ప్రసారం అవుతూనే ఉందని ఏబీ ఇంటర్నేషనల్ పిటిషన్‌లో పేర్కొంది.



# పండంటి బిడ్డకు జన్మనిచ్చిన లావణ్య త్రిపాఠి

నటుడు వరుణ్ తేజ్,లావణ్య త్రిపాఠి దంపతులు తల్లిదండ్రులు అయ్యారు. బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో లావణ్య త్రిపాఠి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మరోవైపు చిరంజీవి కూడా 'మన శంకరవరప్రసాద్‌గారు' సెట్స్ నుంచి నేరుగా ఆసుపత్రికి వెళ్లి వరుణ్, లావణ్యలకు శుభాకాంక్షలు తెలిపారు. తాము తల్లిదండ్రులం కానున్నట్లు- వరుణ్ తేజ్ మేలో సోషల్ మీడియా వేదికగా తెలిపారు. 'జీవితంలో అత్యంత అందమైన పాత్ర పోషించనున్నాను. కమింగ్ సూన్' అనే క్యాప్షన్‌తో శుభవార్తను పంచుకున్నారు. తాజాగా వీరికి బాబు పుట్టడంతో మెగా ఇంట్లో సందడి వాతావరణం నెలకొంది. సెలబ్రిటీ-లు ఈ జంటకు విషెస్ చెబుతున్నారు. లావణ్య త్రిపాఠిని వరుణ్ తేజ్ ప్రేమ వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. 2017లో 'మిస్టర్' సినిమా కోసం వరుణ్ - లావణ్య తొలిసారి కలిసి నటించారు. అప్పుడే ఇద్దరూ మంచి స్నేహితులయ్యారు. 2023 నవంబర్ 1న ఇటలీలోని టస్కానీ వేదికగా వీరిద్దరూ వివాహబంధంతో ఒక్కటయ్యారు.









# మెగాస్టార్‌ను కలుసుకున్న పూరిసేతుపతి బృందం

అగ్ర దర్శకుడు పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా ప్రాజెక్ట్ 'పూరి సేతుపతి'. విజయ్ సేతుపతి హీరోగా రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌లో టబు హీరోయిన్‌గా నటిస్తుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటు-ండగా.. తాజాగా ఈ చిత్రయూనిట్ మెగాస్టార్ చిరంజీవిని కలుసుకుంది. మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం అనిల్ రావిపూడితో కలిసి మన శంకరవరప్రసాద్ గారు అనే సినిమాను తెరకెక్కిస్తు న్నాడు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతుండగా.. ఈ సినిమా పక్కనే షూటింగ్ జరుపుకుంటు-న్న 'పూరి సేతుపతి' టీ-మ్ చిరుని కలుసుకుని ఆశీస్సులు తీసుకుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోను చిత్రబృందం ఎక్స్ వేదికగా పంచుకుంది. ఇందులో నటు-లు చిరంజీవితో పాటు- విజయ్ సేతుపతి, టబు, నయనతార, ఛార్మీ తదితరులు ఉన్నారు.



# సూపర్ ఫీమేల్ హీరోగా కళ్యాణి ప్రియదర్శి ప్రశంసలు

'లోక చాప్టర్ 1: చంద్ర' తెలుగులో కొత్త లోకగా విడుదలై మంచి ఆదరణ తెచ్చుకుంది. ఇప్పటికే 200 కోట్ల వసూళ్లు రాబట్టింది. ఈ చిత్రంతో థియేటర్లలో కల్యాణి ప్రియదర్శన్ సందడి చేస్తున్నారు. మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ నిర్మించిన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలు అందుకుంటూ రూ.కోట్లు- వసూలు చేస్తోంది. దీనిపై కల్యాణి ప్రియదర్శన్ ఆనందం వ్యక్తంచేశారు. దేశంలోనే మొదటి ఫీమేల్ సూపర్ హీరో సినిమాలో నటించడం గర్వంగా ఉందన్నారు. మలయాళంలో 'లోక చాప్టర్ 1: చంద్ర' భారీ విజయం సాధించిన దగ్గర నుంచి అందరూ నన్ను ఫీమేల్ సూపర్ హీరో అని పిలుస్తున్నారని ఆనందం వ్యక్తం చేసింది. నా ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. ఈ సినిమా విజయం సాధించడానికి నాతో పాటు- మా టీమ్‌లోని వారంతా కష్టపడ్డారు. ఈ సక్సెస్ క్రెడిట్ వాళ్లకు కూడా వెళ్తుంది. నేను ఈ చిత్రానికి సైన్ చేసినప్పుడు ఇంత విజయం సాధిస్తుందని ఊహించలేదు. మంచి కథలో భాగం కావాలని మాత్రమే ఆలోచించాను. చిత్రీకరణ చేసే సమయంలోనే ఇది కచ్చితంగా విజయం సాధిస్తుందని అర్థమైంది. ఈ సినిమా మొత్తాన్ని నేను భుజాలపై వేసుకొని మోసానంటూ ప్రేక్షకులు నన్ను అభినందిస్తున్నారు. కానీ, మా టీమ్‌లో పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా ప్రతిఒక్కరూ దీనికోసం కష్టపడ్డారు. 'లోక చాప్టర్ 1: చంద్ర' మొదటి ఫీమేల్ సూపర్ హీరో సినిమా కావడం వల్ల ఎంతోమంది స్ఫూర్తి పొందుతున్నారు. హీరోయిన్స్ కూడా ఎలాంటి పాత్రల్లోనైనా చేయగలరు అని అందరికీ నమ్మకం కలిగిందని కల్యాణి ప్రియదర్శన్ చెప్పారు. డామినిక్ అరుణ్ తెరకెక్కించిన ఈ చిత్రం ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దుల్కర్ దీన్ని రూ.30 కోట్లతో నిర్మించగా.. ఇప్పటివరకూ రూ.200కోట్లు వసూలు చేసింది. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం ఓ పోస్టర్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా అత్యధిక వసూలు సాధించిన నాలుగో మలయాళ చిత్రంగా నిలిచిందని పేర్కొంది.

# మిరాయ్‌లో ట్రైన్ సీక్వెన్స్ ఓ పెద్ద అనుభూతి



తేజ సజ్జా కథానాయకుడిగా నటించిన చిత్రం 'మిరాయ్' రితికానాయక్ కథానాయిక. మంచు మనోజ్ ముఖ్యభూమిక పోషించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయి-ంలో రూపొందిన ఈ చిత్రం సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబందం ప్రచారాన్ని ముమ్మరం చేసింది. తాజాగా ఇందులోని ట్రైన్ సీక్వెన్స్‌ను వివరిస్తూ ఓ బీటీఎస్ వీడియో విడుదల చేసింది. ఈ సీక్వెన్స్ సినిమాలో పెద్ద ఛాలెంజ్ అని.. కథను మలుపుతిప్పే సన్నివేశం అని టీమ్ పేర్కొంది. తేజ రిస్క్ చేసి ఇందులో నటించారని చిత్రబృందం తెలిపింది. ఇదిలావుంటే తన చిన్నప్పుడు మెగాస్టార్ చిరంజీవితో కలిసి నటించినా.. మరోసారి ఆయనతో సినిమా చేయాలనుందని నటుడు తేజ సజ్జా తెలిపారు. అవకాశం వస్తే చిరుతో మల్టీస్టారర్ మూవీ చేస్తానన్నారు. తేజ హీరోగా కార్తిక్ ఘట్టమనేని తెరకెక్కించిన చిత్రం 'మిరాయ్' చిత్రం సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తేజ సమాధానమిచ్చారు.

# కిష్కిందపురి నచ్చకుంటే చిత్రసీమ వదిలేస్తా

## హీరో బెల్లంకొండ శ్రీనివాస్ గట్టి నమ్మకం

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా వస్తున్న చిత్రం కిష్కింధపురి. కౌశిక్ పెగల్లపాటి దర్శకుడు. షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. హారర్ థ్రిల్లర్ జానర్ లో వస్తున్న ఈ సినిమా -ట్రైలర్ కు మంచి స్పందన లభించింది. భైరవం తర్వాత వస్తున్న ఈ సినిమాపై బెల్లం కొండ చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాడు. ఈ నెల 12న ఈ సినిమా వరల్డ్ వైడ్ గా రిలీజ్ కాబోతుంది. కాగా ఈ సినిమాను భారీ స్థాయిలో ప్రమోట్ చేస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో బెల్లం కొండా మాట్లాడుతూ ' సినిమా అంటే రెండున్నర గంటలు ఆడియెన్స్ ని ఎంటర్టైన్ చేయడం. థియేటర్ లో కూర్చున్నపుడు ప్రేక్షకుడు బోర్ ఫిల్ అయి మొబైల్ చూడకుంటే ఆ సినిమా హిట్. నేను కాన్ఫిడెంట్ గా చెప్తున్న కిష్కిందపురి సినిమా స్టార్ట్ అయిన పది నిమిషాల తర్వాత ఆడియెన్స్ ఫోన్ చూడరు. ఒకవేళ అలా ఎవరైనా చూస్తే నేను అసలు ఇంకా సినిమాలు చేయను ఇండస్ట్రీ వదిలి వెళ్తాను. ఈ సినిమా అంత బాగుంటు-ంది. ఇది నేను ఛాలెంజ్ చేసి చెప్తున్నా. ఈ సినిమా కథపై నమ్మకంతో చెప్తున్న. కథ పరంగా, సౌండింగ్ పరంగా ఈ సినిమా చాలా బాగుంటుంది. ఆ నమ్మకంతో చెప్తున్న కిష్కింధపురి మిమ్మల్ని తప్పకుండా ఆకట్టుకుంటుంది' అని అన్నారు. బెల్లం కొండా చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. మరి బెల్లం స్టార్ మాటలు ఎంతవరకు నిజమవుతాయో రెండు రోజుల్లో తెలుస్తుంది.



Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463